https://www.sreechakranews.com

# శ్రీచక్ర

SREECHAKRA TELUGU DAILY

సంపుటి 11 | సంచిక 96 | కర్నూలు | ఆదివారం 17-05-2026

Published from Kurnool... Circulated by Andhra Pradesh, Telangana & New delhi



మరిన్ని కథనాల కోసం యూట్యూబ్‌లో ప్రసారమవుతున్న మీ SREECHAKRA NewsTVని వీక్షించవచ్చు. ప్లీజ్, సబ్‌స్క్రైబ్, లైక్.



# పేదరికం లేని సమాజామే లక్ష్యం

**స్వచ్ఛత మన జీవితోల భాగం కావాలి**

**ఎక్కువమంది పిల్లలే మనకు సంపద**

**స్వఛ్ఛాంద్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో సిఎం చంద్రబాబు**




శ్రీకాకుళం,మే16 (శ్రీచక్ర) : పేదరికం లేని సమాజం చూడాలనేదే తన కోరిక అని సీఎం చంద్రబాబు అన్నారు. సమాజం మారితే స్వచ్ఛాంధ్ర సాకారమవుతుందని చెప్పారు. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట పర్యటనలో ఉన్న సీఎం చంద్రబాబు.. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తలసరి ఆదాయం పెంచాలనేది తన ప్రధాన లక్ష్యమన్నారు. సంపద సృష్టించి పేదవాళ్లకు పంచాలి. ఆర్థిక అసమానతలు తగ్గించాలి. ప్రభుత్వానికి మంచిపేరు వచ్చిందంటే అది అధికారుల వల్లే వస్తుంది. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రతో స్వచ్ఛత వైపు అడుగులు వేస్తున్నాం. స్వచ్ఛమైన ఆలోచనలు చేయాలి. అదే మనకు మంచి చేస్తుంది. అలవాట్లు మారాలి.. తద్వారా సమాజం మారుతుంది. గత 16 నెలలుగా స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర నిర్వహిస్తున్నాం. వ్యర్థాల నుంచి కరెంట్ ఉత్పత్తి చేస్తున్నాం. ఒకప్పుడు నా పాదయాత్రల సమయంలో చెత్తే ఎక్కువ కనిపించేది. చెత్త నుంచి సంపద సృష్టించడానికి పార్కులు ఏర్పాటు చేశాం. సింగిల్ యూజ్ ఎ÷-లాస్టిక్‌ను నిషేధించాలి. గత 23 నెలల్లో రాష్ట్రానికి రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలతో మన పిల్లలకు 24 లక్షల ఉద్యోగాలు వస్తాయి. విశాఖకు గూగుల్ తీసుకొచ్చాం. పరిశ్రమలతో ఉత్తరాంధ్రకే వలసలు రావాలని చంద్రబాబు అన్నారు. ఒకప్పుడు కుటుంబ నియంత్రణ పాటించాలని చెప్పాం. పిల్లలే సంపద అని ఇవాళ చెబుతున్నా. మూడో బిడ్డ పుట్టిన వెంటనే రూ.30 వేలు ఇస్తాం. నాలుగో బిడ్డ పుడితే.. రూ.40 వేలు ఇస్తాం. పిల్లలు భారమనుకోకూడదు.. వాళ్లే సంపద అని గుర్తించాలి. తల్లికి వందనం కింద రూ.15 వేలు అందిస్తున్నాం. భగవంతుడు కరుణిస్తే.. ఈ మొత్తాన్ని పెంచుతాం అని అన్నారు. గత ఐదేళ్లు గొడ్డలి పార్టీ చేసిన అరాచకం చూశాం. ప్రజల ఆస్తులన్నీ మార్చేసి గందరగోళం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల భూముల జోలికి ఎవరూ రాకుండా చర్యలు చేపట్టాం. భూ తగాదాలు లేకుండా చేసే బాధ్యత కూటమి ప్రభుత్వానిది.




# ఏపీ ఐసెట్-2026 ఫలితాల విడుదల



అమరావతి,మే16 (శ్రీచక్ర) ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించిన ఏపీ ఐసెట్-2026 ఫలితాలను మంత్రి నారా లోకేష్ విడుదల చేశారు. ఈ సందర్భంగా పరీక్షలో మొత్తం 91.41 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు వెల్లడించారు. ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఈ పరీక్షకు రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు హాజరయ్యారు. ఫలితాలను అధికారిక వెబ్‌సైట్ లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. విద్యార్థులు తమ హాల్‌టికెట్ నంబర్ ద్వారా ఫలితాలను చెక్ చేసుకోవచ్చని సూచించారు.

# ఎలక్ట్రిక్ సైకిల్‌పై కలెక్టరేట్‌కు వెళ్లిన కలెక్టర్

**నా దేశం - నా బాధ్యతతో పొదుపు చర్యలకు శ్రీకారం**

**పర్యావరణహిత జీవనశైలిపై ప్రజల్లో అవగాహన**

**ముఖ్యమంత్రి పిలుపునతో కలెక్టర్ లక్ష్మీశ అడుగులు**

విజయవాడ,మే16(శ్రీచక్ర) ప్రపంచ వ్యాప్త సంక్షోభం నేపథ్యంలో ప్రతిఒక్కరూ నా దేశం-నా బాధ్యత నినాదంతో పొదుపు చర్యలను రోజువారీ జీవితంలో భాగం చేసుకోవాలని.. ఇంధన ఆదాతో ఆర్థికంగా లాభంతో పాటు పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావొచ్చని ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. కలెక్టర్ లక్ష్మీశ శనివారం ఉదయం నగరంలోని క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టరేట్‌కు ఎలక్ట్రిక్ సైకిల్‌పై వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర, ఆత్మనిర్భర్ భారత్ దిశగా ఒక్కో అడుగు ముందుకేస్తున్నామని.. ప్రస్తుత సంక్షోభ పరిస్థితుల నేపథ్యంలో ఖర్చులను నియంత్రిస్తూ, అందుబాటులో ఉన్న వనరులను పొదుపుగా వినియోగించుకోవాలన్న ముఖ్యమంత్రి పిలుపునకు అనుగుణంగా ఎన్‌టీఆర్ జిల్లా యంత్రాంగం కార్యాచరణ ప్రారంభించిందని తెలిపారు. ఇందులో భాగంగా డీజిల్, పెట్రోలు వాహనాలకు బదులు ఎలక్ట్రిక్ వాహనాలు వినియోగం దిశగా ప్రజలను ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ రోజు ఎలక్ట్రిక్ సైకిల్‌పై కార్యాలయానికి వెళ్లినట్లు వివరించారు. స్థానిక యువత రూపొందించిన ఈ-సైకిళ్లు చాలా బాగున్నాయని, ఇలాంటి ఇన్నొవేషన్స్‌ను ప్రతిఒక్కరూ ప్రోత్సహించా ల్సిన అవసరముందన్నారు. స్థానికంగా సందర్శనలు, తనిఖీలకు విద్యుత్ సైకిళ్లు, అదేవిధంగా దూర ప్రాంతాలకు విద్యుత్ వాహనాలను వినియోగించేలా అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. దేశ భవిష్యత్తు దృష్ట్యా ప్రతిఒక్కరూ పర్యావరణ పరిరక్షణతో పాటు ఆర్థిక పొదుపును సాధించే జీవనశైలిని అలవరచుకోవాల్సిన అవసరం ఉందని, ఈ విషయంలో ప్రభుత్వ యంత్రాంగం ముందుండి ప్రజలకు ఆదర్శంగా నిలుస్తుందని స్పష్టం చేశారు. తాను ఇప్పటికే రెండు చిట్టి పాంథర్ విద్యుత్ సైకిళ్లను కొనుగోలు చేశామని.. ఒక్కసారి ఛార్జ్ చేస్తే ఈ సైకిల్‌పై ఏకధాటిగా 40 కి.మీ. ప్రయాణించవచ్చన్నారు.

# నెదర్లాండ్స్ పర్యనటలో ప్రధాని మోడీ

**మోడీకి ప్రవాసభారతీయులు ఘన స్వాగతం**

**సెమీ కండక్టర్ల విషయలంఓ భారత్ దూసుకెళ్తోందని వెల్లడి**

**యూనికార్న్ సంస్థలు వందకు చేరాయని ప్రకటన**

**మన సంస్కృతీసంప్రదాయాలు చిరస్మరణీయమని కితాబు**

న్యూఢిల్లీ,మే16(శ్రీచక్ర) : సెమీకండక్టర్ల విషయంలో భారత్ కీలక ముందడుగు వేసిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. భారతదేశం అభివృద్ధిలో దూసుకెళ్తోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. డిజిటల్ చెల్లింపుల్లో ప్రపంచంలోనే భారత్ అగ్రస్థానంలో ఉందని చెప్పారు. దేశంలో ప్రస్తుతం నెలకు 20 బిలియన్ డాలర్ల డిజిటల్ ట్రాన్సాక్షన్లు జరుగుతున్నాయని తెలిపారు. భారత్‌లో ఒకప్పుడు కేవలం 4 యూనికార్న్ సంస్థలే ఉండేవని.. ప్రస్తుతం అవి 100కు చేరాయన్నారు. సెమీకండక్టర్ల అంశంలోనూ భారత్ ముందడుగు వేసిందని.. ఆ దిశగా పనులు కూడా జరుగుతున్నాయని పేర్కొన్నారు. నెదర్లాండ్స్ పర్యటనలో ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ.. ది హేగ్ నగరంలో ప్రవాస భారతీయులను కలిశారు. వారితో మాటామంతీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఆర్ఐలపై ప్రశంసలు కురిపించారు. లక్ష్యాలను అధిగమించి వారు పని చేస్తున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రధానికి ఘనస్వాగతం లభించింది. ప్రవాస భారతీయులతో కరచాలనం, మాటామంతీ నిర్వహించారు. నెదర్లాండ్స్ నాయకత్వంతో ఎప్పుడు మాట్లాడినా ప్రవాస భారతీయులను ఎంతో ప్రశంసించేవారని ప్రధాని గుర్తు చేసుకున్నారు. హేగ్ నగరం భారతీయ స్నేహానికి సజీవ చిహ్నంగా మారిందన్నారు. కాలం మారినా.. భారతీయ సంస్కృతి మారలేదని కొనియాడారు. ఈ సందర్భంగా ఈయూ దేశాల నుద్దేశించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. డిజిటల్ చెల్లింపుల్లో భారత్ అగ్రస్థానంలో ఉంది. నెలకు 20 బిలియన్ డాలర్ల విలువైన డిజిటల్ చెల్లింపులు జరుగుతున్నాయి. భారత్‌లో ఒకప్పుడు కేవలం 4 యూనికార్న్ సంస్థలే ఉండేవి. ఇప్పుడు 100కిపైగా ఉన్నాయి. భారత్‌లో సెమీ కండక్టర్ ప్లాంట్ల పనులు జరుగుతున్నాయి. మేడిన్ ఇండియా చిప్‌లు తయారవుతున్నాయి. ఏఐ సమ్మిట్, జీ20 సమావేశాలను విజయవంతంగా నిర్వహించగలిగాం. భారత్‌లో 90 కోట్ల మంది ఓటర్లుగా నమోదయ్యారు. 2024 లోక్ సభ ఎన్నికల్లో 64 కోట్ల మంది ఓటు వేశారు. ఈయూ దేశాల జనాభా మొత్తం కలిపినా 64 కోట్ల మంది కూడా లేరని మోదీ తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాట్లాడుతూ.. 'ఇంతటి ప్రేమ, ఉత్సాహాన్ని చూసి నెదర్లాండ్స్‌లో ఉన్నానన్న సంగతి ఒక్క క్షణం మర్చిపోయాను. భారతదేశంలోనే ఓ ఉత్సవానికి హాజరైనట్లు అనిపించింది. భారత స్నేహానికి ది హేగ్ సజీవ చిహ్నంగా మారిందని అనిపిస్తోంది. నేను నెదర్లాండ్స్ నాయకత్వంతో మాట్లాడిన ప్రతిసారీ వారు ప్రవాస



భారతీయులను ప్రశంసిస్తూనే ఉంటారు. నెదర్లాండ్స్ సమాజానికి, ఆర్థిక వ్యవస్థకు మీరు చేసిన సేవకు ప్రతి భారతీయుడు గర్వపడుతున్నాడు. మీ పూర్వీకులు ఇక్కడికి వచ్చినప్పుడు ఎన్నో విషయాలను వదిలేశారు. కానీ కొన్ని విషయాలు ఎల్లప్పుడూ వారితోనే ఉండిపోయాయి. భారతదేశ మట్టి పరిమళం, పండుగల జ్ఞాపకాలు, భక్తి గీతాల రాగాలు, పూర్వీకులు అందించిన విలువలు వారితోనే ఉన్నాయి. కాలక్రమేణా ఎన్నో సంస్కృతులు కనుమరుగయ్యా యనే వాస్తవానికి మానవ చరిత్రే సాక్ష్యం.

# ప్లాస్టిక్ వాడకంతో అనర్థాలు

**ప్రజలు ప్లాస్టిక్‌కు దూరంగా ఉండాలి**

**స్వాచ్ఛాంధ్ర కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర**



మచిలీపట్నం,మే16(శ్రీచక్ర) ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కంకణం కట్టుకున్నారని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. శనివారం మచిలీపట్నం రైతు బజార్ ప్రాంగణంలో జరిగిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని పక్కా ప్రణాళికతో నిర్వహించాలన్నారు. గ్రామ వార్డు, సచివాలయాల వారీగా ప్రతినెల మూడో శనివారం ఈ కార్యక్రమం తప్పనిసరిగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల జరిగే అనర్థాలను, ప్రజలకు జరిగే నష్టాలను వివరించాలని.. దీనిపై సమగ్ర అవగాహనతో ముందుకు వెళ్లాలని అధికారులకు మంత్రి కొల్లు రవీంద్ర సూచించారు. రాష్ట్రంలో ఆర్టీసీ బస్సుల ప్రైవేటీకరణ ప్రస్తుత పరిస్థితుల్లో తప్పనిసరి అని ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు అన్నారు. ప్రభుత్వం ఎలక్ట్రిక్ బస్సుల కొనుగోలుకు సబ్సిడీ ఇస్తున్నప్పటికీ.. ఒక్కో బస్సు ధర సుమారు రూ.1.60 కోట్ల నుంచి రూ. 1.70 కోట్ల వరకు ఉందన్నారు. ?ఇంత పెద్ద మొత్తంలో నిధులు వెచ్చించి బస్సులను కొనుగోలు చేయడం ప్రస్తుతానికి ఆర్టీసీకి, ప్రభుత్వానికి సాధ్యం కాని పనిగా చెప్పుకొచ్చారు. దీనికి బదులుగా బస్సులను ప్రైవేట్ ఆపరేటర్లకు అప్పగిస్తే.. వారే పెట్టుబడులు పెట్టి బస్సులను నడుపుతారన్నారు. దీనివల్ల ఆర్టీసీపై అదనపు ఆర్థిక భారం తగ్గుతుందని తెలిపారు. ÷ాష్ట్రంలో సుమారు 10 వేల బస్సులు నడుస్తున్నాయని ఆర్టీసీ ఛైర్మన్ తెలిపారు. వాటన్నింటి స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులను తీసుకురావాలంటే దాదాపు రూ.15 వేల కోట్లు అవసరమని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడం వల్ల ఆర్టీసీపై ఇప్పటికే ఆర్థిక భారం పెరిగిందన్నారు. ప్రయాణికులకు ఛార్జీలు పెంచే ఆలోచన ఏదీ లేదని స్పష్టం చేశారు. డీజిల్ బస్సులతో పోలిస్తే ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణ ఖర్చు చాలా తక్కువన్నారు. ఎలక్ట్రిక్ బస్సుల వల్ల పర్యావరణ కాలుష్యం తగ్గడమే కాకుండా, నిర్వహణ వ్యయం తగ్గి.. ప్రయాణికులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించే అవకాశం ఉంటుందని అన్నారు.

# ఇంధన పొదుపుపై ప్రత్యేక దృష్టి

**20 లక్షల సూర్యఘర్ కనెక్షన్లు లక్ష్యం**

**సౌరవిద్యుత్ ఏర్పాటులో ప్రోత్సాహం**

**ప్రధాని, ముఖ్యమంత్రి సూచనల అమలుకు కృషి**

**విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ వెల్లడి**

అమరావతి,మే16(శ్రీచక్ర) : ఇంధన పొదుపు చర్యలను పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్నట్లు ఏపీ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. ప్రభుత్వ ఆఫీసులు, పాఠశాలల్లో సోలార్ విద్యుత్ ఏర్పాటు చేస్తామన్నారు. సోలార్ ద్వారా వంట చేసుకునే విధానాలు ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. విద్యుత్ సంస్కరణలు అందిపుచ్చుకునే తొలి రాష్ట్రం మనదేనని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో ఇంధన పొదుపు అనేది కీలకం కానుందన్నారు. దేశంలో కోటి సూర్యఘర్ కనెక్షన్లు ఉండాలని ప్రధాని చెప్పారని తెలిపారు. ఒక్క ఏపీలోనే 20 లక్షల కనెక్షన్లు లక్ష్యంగా పని చేస్తున్నట్లు మంత్రి గొట్టిపాటి వెల్లడించారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ఇంధన పొదుపు మీద ప్రత్యేకమైన దృష్టి సారించినట్లు మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. ఖర్చులు తగ్గించుకోవాలని, పగటిపూట మన ఇంటిపైనే సౌరశక్తి ద్వారా విద్యుత్‌ను తయారుచేసుకుని వినియోగించుకోవాలని సీఎం చెప్పారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 6 లక్షల కనెక్షన్లు, ఒక్కో ఇంటిపైన 2 కిలోవాట్లు ఉచితంగా పేదలకు ఇవ్వాలని చాలా పెద్ద ఎత్తున సూర్యఘర్ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. ఇంధన పొదుపు అనేది చాలా ముఖ్యమైన అంశంగా ముఖ్యమంత్రి ముందుకువెళుతున్నారని మంత్రి అన్నారు. గ్యాస్, పెట్రోల్, డీజిల్ లాంటి శిలాజ ఇంధనాలను భారతదేశం నిత్యం బయటి దేశాల నుంచి దిగుమతి చేసుకోవలసిన పరిస్థితి ఉందని మంత్రి తెలిపారు. సౌరశక్తి, గాలి ద్వారా ఇలా ప్రత్యమ్నాయ పద్ధతుల నుంచి విద్యుత్ ఉత్పత్తి చేయాలని సీఎం చెప్పారన్నారు. ప్రతి ఇంటిపై 2 కిలోవాట్లకు రూ.60 వేలు, 3 కిలోవాట్లకు రూ.78 వేలు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ఇస్తోందన్నారు. అదనంగా ఇంకో రూ.20 వేలు కలిపి ఇవ్వాలని ముఖ్యమంత్రి తెలిపారన్నారు.

# ముస్లిం పేద విద్యార్థులకు ఉచిత కోచింగ్ అవకాశాలు

**తాలీమ్ - ఏ - హునర్ టాలెంట్ టెస్టుకు నంద్యాలలో విస్తృత ఏర్పాట్లు:జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**



నంద్యాల, మే 16 (శ్రీచక్ర): జిల్లాలో ముస్లిం పేద విద్యార్థులకు ఉన్నత విద్యా అవకాశాలను కల్పించేందుకు ఈనెల 17వ తేదీ నిర్వహిస్తున్న "తాలీమ్ ఏ హునర్ ఎడ్యుకేషన్ మిషన్ టాలెంట్ టెస్ట్" పరీక్షకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ టాలెంట్ టెస్ట్‌కు 10వ తరగతి ఉత్తీర్ణులైన ముస్లిం పేద విద్యార్థులు అర్హులని, ముఖ్యంగా 450 మార్కులకు పైగా సాధించిన వారు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించామని పేర్కొన్నారు. అలాగే అఖాఇ, ఎఆూఇ వంటి పరీక్షల్లో 75 శాతం మార్కులు సాధించిన విద్యార్థులు కూడా అర్హులని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అందిన దరఖాస్తులలో ప్రతిభ ఆధారంగా కేవలం 250 మంది విద్యార్థులను మాత్రమే ఎంపిక చేయనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ఎంపికైన విద్యార్థులకు కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఐఐటీ, జేఈఈ, నీట్, ఎంసెట్ లకు ఉచిత కోచింగ్‌తో పాటు ఉచిత వసతి సదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో తొలిసారిగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. నంద్యాల జిల్లా నుంచి దాదాపు 750 మంది విద్యార్థులు ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. చివరి తేదీ అనంతరం దరఖాస్తు చేసుకున్న కొంతమంది విద్యార్థులు కర్నూలు, డోన్ తదితర కేంద్రాలను కూడా ఎంపిక చేసుకున్నారని చెప్పారు. పరీక్ష ఈనెల 17వ తేదీ మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించబడుతుందని, విద్యార్థులు పరీక్ష ప్రారంభానికి కనీసం అరగంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. 10వ తరగతి సిలబస్ ఆధారంగా మ్యాథ్స్, ఫిజికల్ సైన్స్, నేచురల్ సైన్స్ అంశాలపై ఆబ్జెక్టివ్ విధానంలో పరీక్ష నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. నంద్యాల పట్టణంలోని మున్సిపల్ హైస్కూల్‌లో 240 మంది విద్యార్థులు, శ్రీనివాస్ సెంటర్‌లోని నేషనల్ డిగ్రీ కాలేజ్‌లో 450 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. విద్యార్థులు తమ హాల్ టికెట్లు, అవసరమైన పత్రాలు వెంట తీసుకురావాలని, పరీక్షను సక్రమంగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# దేశసేవకు ప్రేరేపించేదే నిజమైన ధర్మం

**డాక్టర్ మల్లు వేంకటరెడ్డి, తి.తి.దే.**
**వేముగోడులో ఘనంగా ముగిసిన తి.తి.దే. ధార్మిక కార్యక్రమాలు**



గోనెగండ్ల, మే 16 (శ్రీచక్ర): ధర్మమంటే కేవలం పూజలు, వ్రతాలు మాత్రమే కాదని, మన దేశం, సమాజం, ప్రజల శ్రేయస్సు కోసం పనిచేయాలనే బాధ్యతను కలిగించేదే నిజమైన ధర్మమని, దేశం కోసం త్యాగ భావాన్ని, ప్రజల కోసం జీవించడం నేర్పేదే సనాతన ధర్మమని, మాతృభూమిని గౌరవించని భక్తి అసంపూర్ణమని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో గోనెగండ్ల మండలం, వేముగోడు గ్రామంలోని శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి దేవస్థానం నందు గత ఐదు రోజులుగా జరుగుతున్న ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాల ముగింపు సందర్భంగా ఆలయ అర్చకులు మల్లిఖార్జునయ్య గోపూజ మరియు కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. ఇస్కాన్ ధర్మ ప్రచారకులు నిత్యతృప్తదాస్ స్వామి చేసిన ధార్మిక ప్రవచనాలు, స్థానిక భజన మండలి నిర్వహించిన భజన కార్యక్రమాలు భక్తులను ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో భజన మండలి అధ్యక్షులు యాగంటి ఈశ్వరరెడ్డి, హార్మోనిష్టు జి. ఈరన్న, డక్కీ మాష్టారు ఎ. వీరన్న, తబలిష్టు కె. అర్జున్, వై.రాజారెడ్డి, బి. చిన్నయ్య, రంగన్న, ఎ. వినోద్, మద్దిలేటి, సి. ఉరుకుందు, యం. లక్ష్మణ్ణ, జి.రామాంజనేయులు, రాఘవేంద్రతోపాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



# టి.జి.వి భవన్ లో తలసేమియా కేంద్రము ఏర్పాటుకు కోటి రూపాయల విరాళం ప్రకటన,రూ 25 లక్షల చెక్ అందజేత

**కర్నూలు అభివృద్ధికి అన్ని విధాల కృషి చేస్తున్నాం**
**ప్రజా సేవలో మా కుటుంబం ముందుంటుంది**
**పరిశ్రమలు , వాణిజ్యం మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి.భరత్ గుప్త**
**క్యాన్సర్ ఆసుపత్రి " మైక్రోటామ్ " పరికరం కొరకు రూ 9 లక్షల ఎంపీ నిధులు కేటాయింపు**
**కర్నూలు పార్లమెంటు సభ్యులు బస్తిపాటి నాగరాజు**





కర్నూలు, మే 16 (శ్రీచక్ర): కర్నూలు అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తూ ఉన్నామని మంత్రి టి. జి.భరత్ తలసేమియా కేంద్రం టి జి వి భవన్ లో ఏర్పాటు కు నిర్మాణ భూమి పూజ సందర్భంగా పేర్కొన్నారు.శనివారం ఉదయం కర్నూలు బ్లడ్ బ్యాంక్ ఆవరణలో దాదాపు ఒక కోటి 50 లక్షల రూపాయల ఖర్చుతో నిర్మించ తలపెట్టిన టి.జి. వెంకటేష్ భవన్ లో తల సేమియా (రక్త మార్పిడి చేయుటకు ) కేంద్రాని కి పరిశ్రమలు , వాణిజ్యం మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి.భరత్ గుప్త మరియు కర్నూలు పార్లమెంటు సభ్యులు బస్తిపాటి నాగరాజు భూమి పూజ నిర్వహించారు , జ్యోతి ప్రజ్వలన గావించి శిలాఫలకాన్ని సంయుక్తంగా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మంత్రి టి. జి.భరత్ గుప్త మాట్లాడుతూ కర్నూలు అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తూ ఉన్నామని తెలిపారు. గెలుపు ఓటమిలకు సంబంధం లేకుండా రాజకీయాలకు సంబంధం లేకుండా కర్నూలు అభివృద్ధికి ఎల్లవేళలా మా కుటుంబం ముందుగా ఉంటుందని తెలిపారు. ఈరోజు మా తండ్రి మాజీ మంత్రి , మాజీ పార్లమెంటు సభ్యులు టి.జి.వెంకటేష్ గారి జన్మదిన సందర్భంగా ఒక మంచి పని చేయాలన్న ఉద్దేశంతో మా టి.జి. వి గ్రూప్ నుండి ఒక కోటి రూపాయల విరాళం ఈ టి జి వి భవన్ లో తల సేమియా కేంద్రానికి ప్రకటించడం మరియు అందులో భాగంగా ప్రస్తుతం 25 లక్షల రూపాయల చెక్కును కర్నూలు బ్లడ్ బ్యాంక్ కు చెందిన రెడ్ క్రాస్ సొసైటీకి అందించామని తెలిపారు. ఈ టి జి వి భవన నిర్మాణాన్ని మూడు నెలల లోగా పూర్తి చేయాలని నిర్వాహకులను మంత్రి కోరారు.మా కుటుంబం ప్రజాసేవలో భాగంగా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తూ ఉంటుందని ముఖ్యంగా కళ్యాణ మండపాలు,మినరల్ వాటర్ ప్లాంట్లు , క్రీడా ప్రాంగణాలు మరియు ఇప్పుడు తల సేమియా కేంద్రం ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.సొంత నిధులతో కర్నూలు సర్వజన ఆసుపత్రిలో పలు కార్యక్రమాలు చేస్తూ కార్పొరేట్ స్థాయి ఆస్పత్రిగా మారుస్తున్నామని , మా భాగస్వామ్యంతో మరియు మెడికల్ కాలేజీ పూర్వపు విద్యార్థులతో 70 సెంట్ల స్థలం లో దాదాపు 60 కోట్ల రూపాయలతో నాలెడ్జ్ సెంటర్ భవనము ఏర్పాటు మొదలగు కార్యక్రమాలు చేస్తూ ఉన్నామని తెలిపారు. రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ గోవింద్ రెడ్డి సేవ చేయాలన్న తపనతో నిస్వార్థంగా ప్రజలకు సేవ చేస్తున్నందుకు ఆయనను అభినందిస్తున్నానని మంత్రి తెలిపారు. కర్నూలు ప్రజలు ఎల్లప్పుడూ మా కుటుంబాన్ని ఆశీర్వదించాలని కోరారు.ఈ సందర్భంగా కర్నూల్ ఎంపి బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా కర్నూలులో తల సేమియా కేంద్రం నెల కొల్పడం శుభపరిణామం అని పార్లమెంట్ సభ్యులు పేర్కొన్నారు. మంత్రి భరత్ కుటుంబం ఆర్థిక సహాయంతో నిర్మించ తలపెట్టిన 20 పడకల టి జి వి భవన్ తల సేమియా కేంద్రం ఆంధ్రప్రదేశ్ కే కాకుండా కర్ణాటక , తెలంగాణ రాష్ట్రము ల లో తల సేమియా జబ్బు కు గురి అయిన వారికి ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కేంద్రం ద్వారా జబ్బు పడ్డ వారికి మళ్లీ మళ్లీ రక్తం అందించి వారి జీవన కాలం పొడిగించడం జరుగుతుందని తెలిపారు. మాజీ పార్లమెంటు సభ్యులు మాజీ మంత్రి టి. జి వెంకటేష్ జన్మదిన సందర్భంగా వారిని గౌరవిస్తూ కర్నూలు క్యాన్సర్ ఆసుపత్రికి అవసరమైన " మైక్రోటాం " పరికరం కొనుగోలు నిమిత్తం 9 లక్షల రూపాయలు ఎంపీ నిధుల నుండి కేటాయిస్తున్నట్టు ప్రకటించారు. కర్నూలు అభివృద్ధే పరమావిదిగా ఎం.పీ. గా తాను కూడా కృషి చేస్తున్నానని తెలియజేశారు.ఈ సందర్భంగా డిఎంహెచ్వో కామేశ్వర ప్రసాద్ మాట్లాడుతూ రక్త దానం చాలా పవిత్రమైనదని ఒకసారి రక్త దానం చేస్తే ఆ వ్యక్తి ఒక ప్రాణాన్ని కాపాడిన వారు అవుతారని తెలిపారు. అపోహలను విడనాడి ప్రతి ఒక్కరు రక్తదానం చేస్తూ ఇతరులను కూడా రక్తదానం చేయడానికి ప్రోత్సహించాలని కోరారు. రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ కేజీ గోవిందరెడ్డి , కెవి సుబ్బారెడ్డి మరియు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రామచంద్ర రావు మాట్లాడుతూ ఈ టి జి వి భవన్ ద్వారా తల సేమియా కేంద్రం రోగులకు ఎంతో ఊరట నిస్తుందని దీనికి కారణమైన మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా రెవెన్యూ అధికారి వెంకటనారాయణమ్మ , డి ఎం హెచ్ ఓ కామేశ్వర ప్రసాద్ , రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ కేజీ గోవిందరెడ్డి , ఇంజనీరింగ్ కాలేజ్ అధినేత కె.వి.సుబ్బారెడ్డి , మెడికల్ ఆఫీసర్లు డాక్టర్లు రామచంద్రారావు , శ్రీనివాసులు , కుమారస్వామి రెడ్డి , రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు , బ్లడ్ డోనర్స్ , మాజీ కార్పొరేటర్లు మొదలగువారు పాల్గొన్నారు.

# జిల్లాలో గుర్తించిన బ్లాక్ స్పాట్స్ వద్ద ప్రమాదాల నిర్వహణకు గట్టి చర్యలు తీసుకోవాలి

**బ్లాక్ స్పాట్స్ పరిశీలన యాత్ర ద్వారా బస్సులో ప్రయాణించి బ్లాక్ స్పాట్స్ ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, సంబంధిత శాఖల అధికారులు**







కర్నూలు, మే 16 (శ్రీచక్ర): జిల్లాలో గుర్తించిన 19 బ్లాక్ స్పాట్స్ వద్ద ప్రమాదాల నిర్వహణకు గట్టి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం పంచలింగాల టోల్‌గేట్ నుండి నిర్వహించిన "బ్లాక్ స్పాట్స్ పరిశీలన యాత్ర" లో జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి , జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ పాల్గొని యాత్ర బస్సును జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం పంచలింగాల టోల్‌గేట్ నుండి వెల్దుర్తి వరకు కలెక్టర్, ఎస్పీ పోలీసు, రవాణా, ఆర్ అండ్ బి, నేషనల్ హైవేస్, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి బస్సులో ప్రయాణించి, నేషనల్ హైవే 44 పైన ప్రమాదాలకు కారణం అవుతున్న 9 బ్లాక్ స్పాట్లు, ఎన్ హెచ్ 40 పైన రెండు బ్లాక్ స్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా బ్లాక్ స్పాట్స్ వద్ద సైన్ బోర్డ్ లు, సోలార్ బ్లింకర్స్, లైటింగ్, నో పార్కింగ్ బోర్డులు, స్పీడ్ బ్రేకర్స్, సర్వీస్ రోడ్ ల వద్ద రైలింగ్ ల ఏర్పాటు వంటి షార్ట్ టర్మ్ లో చేయదగిన పనులను ఒక నెలలోపు పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులు ఆదేశించారు. దీర్ఘకాలిక పనులకు సంబంధించి వెంటనే టెండర్లు పిలిచి పనులను ప్రారంభించేలా చూడాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సంతోష్ నగర్ రహదారి లో పారిశుధ్యం లోపించిందని, అలాగే రోడ్డు ఇరువైపుల మొక్కలను పెంచాలని నగరపాలక కమిషనర్ ను కలెక్టర్ ఆదేశించారు. కృష్ణానగర్ హంద్రీ బ్రిడ్జి, ఐటీసీ బ్రిడ్జి ప్రాంతాల్లో సోలార్, స్ట్రీట్ లైట్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. బళ్లారి చౌరస్తా సమీపంలో ప్రమాదాలు అధికంగా జరుగుతున్న నేపథ్యంలో పెట్రోలింగ్ వాహనం ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజల ప్రాణాలను కాపాడేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...నగరంలో గుర్తించిన 19 బ్లాక్ స్పాట్ల వద్ద ప్రమాదాల నివారణకు షార్ట్‌టర్మ్, లాంగ్‌టర్మ్ ప్రణాళికలతో చర్యలు చేపడుతున్నామని తెలిపారు. జాతీయ రహదారులు, ఆర్‌అండ్‌బీ, పోలీసు శాఖ అధికారులతో కలిసి సంయుక్తంగా పరిశీలనలు నిర్వహించి, తక్షణ ప్రమాద నివారణ చర్యలతో పాటు వంతెనలు, ఫ్లైఓవర్లు వంటి దీర్ఘకాలిక అభివృద్ధి పనులపై ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు. సాయంత్రం, రాత్రి వేళల్లోనే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని గణాంకాలు సూచిస్తున్నాయని, ఓవర్‌స్పీడ్, రాంగ్‌రూట్ డ్రైవింగ్, హెల్మెట్ వినియోగం లేకపోవడం, సీట్‌బెల్ట్ ధరించకపోవడం, నిద్రమత్తులో డ్రైవింగ్ వంటి నిర్లక్ష్యాలే ప్రధాన కారణాలని తెలిపారు. ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతో పాటు ప్రజలు కూడా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తేనే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని సూచించారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ? రాష్ డ్రైవింగ్, త్రిబుల్ రైడింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ వంటి ఉల్లంఘనలు ప్రమాదాలకు దారితీస్తున్నాయని తెలిపారు. దీర్ఘకాలం విరామం లేకుండా వాహనాలు నడపడం కూడా ప్రమాదాలకు కారణమవుతోందని, ముఖ్యంగా జిల్లా ప్రవేశ ప్రాంతాల్లో వాహనదారులను ఆపి ముఖాన్ని నీటితో కడుక్కొని , టీ, తాగునీరు అందించే చర్యల ద్వారా ప్రమాదాల నియంత్రణకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. డ్రైవింగ్ సమయంలో నిద్రమత్తు అనిపిస్తే వెంటనే వాహనాన్ని ఆపి విశ్రాంతి తీసుకున్న తర్వాతే ప్రయాణం కొనసాగించాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటూనే ప్రజల్లో అవగాహన పెంపుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని జిల్లా ఎస్పీ తెలిపారు.ఈ కార్యక్రమంలో కర్నూలు ఆర్డీవో (ఇంచార్జి) అనురాధ, జిల్లా రవాణా శాఖ అధికారి శాంతకుమారి, ఆర్ అండ్ బి ఎస్.ఈ మహేశ్వర రెడ్డి, నేషనల్ హైవేస్ పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కల్లూరు అర్బన్ 16వార్డులలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కర్నూలు మున్సిపల్ కమిషనర్‌ను కోరిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి





కల్లూరు, మే 16 (శ్రీచక్ర): కర్నూలు మున్సిపల్ కమిషనర్చల్లా ఓబులేష్ ను శనివారం మర్యాదపూర్వకంగా కలిసిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి కల్లూరు అర్బన్ 16 వార్డులలో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.వార్డులో పలు ప్రాంతాల్లో రోడ్లు దెబ్బతినడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, డ్రైనేజీలు సరిగా లేక మురుగు నీరు నిల్వ ఉండటంతో ప్రజారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని పనిచేయని వీధి లైట్లను వెంటనే మరమ్మతు చేసి ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని కమిషనర్‌ను కోరారు. ప్రజలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జీవించేలా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి మాజీ కార్పొరేటర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛతపై సామాజిక బాధ్యతగా వ్యవహరించాలి

**నగరపాలక కమిషనర్ చల్లా ఓబులేసు పిలుపు**
**కే.సి. కెనాల్‌లో జరుగుతున్న స్వచ్ఛత పనుల పరిశీలన**

కర్నూలు, మే 16 (శ్రీచక్ర): నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు సామాజిక బాధ్యతగా భావించాలని కమిషనర్ చల్లా ఓబులేసు పిలుపునిచ్చారు. శనివారం ఆయన అశోక్‌నగర్ వద్ద కే.సి. కెనాల్‌లో జరుగుతున్న స్వచ్ఛత పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ఉన్న నదులు అపరిశుభ్రంగా ఉంటే పరిసర ప్రాంతాల ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందని తెలిపారు. ప్రతిసారి శుభ్రత పనులు చేపట్టాల్సి వస్తే నగరపాలక సంస్థకు ఆర్థిక భారం పడి, లక్షల రూపాయలు వెచ్చించాల్సి వస్తుందన్నారు. రూ.10 లక్షల వ్యయంతో గత వారం రోజులుగా స్వచ్ఛత పనులు చేపడుతున్నామని, ఇందుకోసం 2 హిటాచీలు, 1 జేసీబీ, 3 ట్రాక్టర్లు, 1 టిప్పర్‌తో స్వచ్ఛత పనులు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. అదేవిధంగా కమిషనర్ ఎన్‌ఆర్‌పేట, ప్రకాష్‌నగర్ ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. సెట్కూర్ కార్యాలయం సమీపంలో ఉన్న అన్న క్యాంటీన్‌ను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం. రఘు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున్, ఎంజల్ ప్రణీత తదితరులు పాల్గొన్నారు.



## పికిల్ అండ్ పటేల్ ను ప్రారంభించిన మంత్రి టీజీ భారత్, ఎమ్మెల్యే గౌరు చరితా



కర్నూలు, మే 16 (శ్రీచక్ర): కర్నూలు నగరంలోని నందికొట్కూరు రూట్ లో వార్త ఆఫీస్ ఎదురుగా పికిల్ అండ్ పటేల్ ప్రారంభించిన శనివారం మంత్రివర్యులు టీజీ భరత్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత్ర రెడ్డిలు పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పికిల్ అండ్ పెడల్ ఇండోర్, అవుట్డోర్ అన్ని సదుపాయాలు కలవని స్టేడియంను ప్రజలు వాడుకోవడానికి అన్ని వేళల అందుబాటులో ఉంటుందని అన్నారు

## అభివృద్ధికి ఆమడదూరంలో కూటమి ప్రభుత్వం





కల్లూరు, మే 16 (శ్రీచక్ర): కూటమి ప్రభుత్వంలో ఎటువంటి చేయలేదని కేవలం ప్రకటనలకు మాత్రమే టిడిపి అభివృద్ధి తప్ప మరోకటి లేదని వైఎస్ఆర్సీపీ నాయకులు మహబూబ్ బాషా మండిపడుతున్నారు. శనివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కర్నూలు నగరంలోని వైఎస్ఆర్సీపీ రాష్ట్ర యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి పై టిడిపి పార్టీ నేత ఆరోపణలు మానుకోవాలని కోరారు. కర్నూలు నగరంలోని జోహరాపురం డంప్ వద్ద అభివృద్ధి పనులు ఎటువంటి చేపట్టలేదని ఎక్కడి చెత్త అక్కడ పడేసి నగర వాసులకు దురుసుతో అనారోగ్యానికి గురి అవుతున్నారని తెలిపారు. రెండు సంవత్సరాల పాలనలో జోహారపురం నుండి చెక్ పోస్టు వరకు ఎటువంటి రహదారి కూడా నిర్మించలేదని ఆరోపించారు. ఇప్పటికైనా టిడిపి పార్టీ నేతలు విమర్శలు మానుకోవాలని టిడిపి పార్టీ నేతలకు సూచించారు.

## 'పది'లో ప్రతిభ చూపిన బాలికలకు శ్రీసిటీలో సత్కారం



శ్రీసిటీ, మే 16(శ్రీచక్ర):పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో విశిష్ట ప్రతిభ కనబరిచిన శ్రీసిటీ పరిసర ప్రాంతాల ప్రభుత్వ పాఠశాలలకు చెందిన నలుగురు ప్రతిభావంతులైన విద్యార్థినులను శ్రీసిటీ తరుపున ఘనంగా సత్కరించారు. స్థానిక బిజినెస్ సెంటర్ లో శ్రీసిటీ డైరెక్టర్ (సి ఎస్ ఆర్) నిరీషా సన్నారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో చిన్మయ మిషన్‌కు చెందిన హెచ్.హెచ్. స్వామి మిత్రానందజీ, ఇతర స్వామీజీలు చేతుల మీదుగా విద్యార్థినులకు నగదు బహుమతులు, జ్ఞాపికలను అందజేసి వారి విద్యా ప్రతిభను, పట్టుదలను అభినందించారు. వీరిలో వరదయ్యపాలెం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఎస్.దిషిత సాయి 595 మార్కులతో తిరుపతి జిల్లా ప్రథమ ర్యాంకు, రాష్ట్ర ద్వితీయ ర్యాంకు సాధించిది. ఈ బాలిక తల్లితండ్రులిద్దరూ ప్రభుత్వ ఉపాధ్యాయులు. అదే పాఠశాలకు చెందిన కె.రేఖ 591 మార్కులతో జిల్లా తృతీయ ర్యాంకు సాధించింది. ఆమె తండ్రి వడ్రంగి జీవనం సాగిస్తున్నారు. శ్రీసిటీ పరిధిలోని మాదనపాలెం జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని బి.కీర్తన 584 మార్కులతో సత్యవేడు మండల టాపర్‌గా నిలిచింది. ఈ విద్యార్థిని తల్లి శ్రీసిటీ పరిశ్రమలో పనిచేస్తుండగా, తండ్రి ప్రవేట్ ఉద్యోగి. ఇక బిహార్‌కు చెందిన బందనా 584 మార్కులతో సుళ్లూరుపేట జెడ్పీ బాలికల పాఠశాలలో ప్రథమ స్థానం సాధించింది. ఈమె తండ్రి శ్రీసిటీ పెప్సీ పరిశ్రమలో చిరుద్యోగి. ఈ సత్కారం ద్వారా వివిధ సామాజిక, ఆర్థిక నేపథ్యాల నుంచి వచ్చిన విద్యార్థుల్లో ప్రతిభను ప్రోత్సహిస్తూ, విద్యా ప్రావీణ్యాన్ని పెంపొందించాలన్న శ్రీసిటీ సంకల్పం ప్రతిఫలించింది. ఈ ప్రతిభావంతులను గౌరవించడం ద్వారా భావితరాలను సాధికారత దిశగా నడిపిస్తూ, అభ్యాసం మరియు ఉన్నత ఆశయాల సంస్కృతిని ప్రోత్సహించడంలో శ్రీసిటీ తన నిబద్ధతను మరొకసారి చాటుకుంది.

## నీతులు చెప్తూ కబ్జాలు చేసే రాజకీయ నాయకులను దూరం పెట్టండి:మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్

కర్నూలు, మే 16 (శ్రీచక్ర): కేవలం స్వలాభం కోసమే రాజకీయాలు చేస్తూ నీతులు చెబుతూ కబ్జాలకు, దౌర్జన్యాలకు పాల్పడే రాజకీయ నాయకులను ప్రజలు దూరంగా ఉంచాలని మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ అన్నారు. శనివారం ఆయన జన్మదిన సందర్భంగా వివాహ బంధంతో ఒకటైన 60 జంటలను ఆయన ఆశీర్వదించి 80 వేల రూపాయల నగదు చెక్కులను అందించారు. మౌర్య ఇన్ హోటల్ పరిణయ ఫంక్షన్ హాల్ నందు జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి టీజీ భరత్ తోసహా టీజీ వెంకటేష్ కుటుంబ సభ్యులందరూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేష్ మాట్లాడుతూ రాజకీయాలలో మంచివారు ఉంటారని, అలాగే స్వార్థంతో బురద చల్లేవారు కూడా ఉంటారని అటువంటి వారికి బుద్ధి చెప్పాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. ఎంతో రాజకీయ చరిత్ర కలిగిన కుటుంబాలలో కూడా ఒకరిద్దరూ పనికిమాలిన వారు ఉంటారని అటువంటి వారికి సరైన రీతిలో స్పందించకపోతే ఎగిరెగిరి పడుతూనే ఉంటారని అన్నారు. సేవ చేయాలి అన్న సదుద్దేశంతోనే రాజకీయాల్లోకి వచ్చామని ఎంతో మంది రాజకీయ నాయకులు తమ ముందు కుప్పిగంతులు వేశారని, అటువంటి వారందరినీ కట్టడి చేసి ఎక్కడ కూడా సేవా కార్యక్రమాలకు అడ్డుతగలకుండా చేసామని టీజీ వెంకటేష్ తెలిపారు. కుల మతాలకు అతీతంగా దశాబ్దాలుగా వివాహాలు జరిపిస్తున్నామని, అలాగే ప్రతి ఒక్కరిని ఆదరిస్తూ సహాయ సహకారాలు అందిస్తున్నామని ఇది ప్రజలు గుర్తించుకోవాలన్నారు. ఎటువంటి వ్యాపారాలు లేకుండా కేవలం స్వలాభం కోసమే రాజకీయాలు చేస్తూ కొంత మంది ప్రజల మధ్యన చిచ్చులు పెడుతూ లబ్ధి పొందుతున్నారని అన్నారు. అటువంటి వారిని గుర్తించి ప్రజలకు ఎవరైతే మంచి చేస్తారో వారినే ఎన్నుకోవాలని అప్పుడే నగర అభివృద్ధి తో పాటు, శాంతి భద్రతలు ప్రశాంతంగా ఉంటాయని టీజీ వెంకటేష్ తెలిపారు. ఇక నూతనంగా వివాహ బంధంతో ఒకటి అయ్యేవారు చెడు అలవాట్లకు లోను కాకుండా జాగ్రత్తగా జీవితం కొనసాగించాలన్నారు. చిన్న వయసులో చెడు అలవాట్లకు లోనయితే భవిష్యత్తు అంధకారంగా మారుతుందని టీజీ









వెంకటేష్ తెలిపారు. తను ఎమ్మెల్యేగా కర్నూల్ నగర అభివృద్ధికి ఎంతగానో కృషి చేశానన్నారు. సొంత నిధులతో పాఠశాలలకు అదనపు గదులు, ఇండోర్ స్టేడియాలు, కళ్యాణ మండపాలు నిర్మించినట్టు టీజీ తెలిపారు. అలాగే తుంగభద్ర నదీ తీరం వెంబడి రింగ్ రోడ్డు ఏర్పాటు చేసేందుకు కృషి చేశామని తెలిపారు. అదే బాటలో మంత్రి టీజీ భరత్ నగర అభివృద్ధికి తన వంతుగా ఎంతగానో కృషి చేస్తున్నాడని తెలిపారు. హంద్రీ నది వెంట రింగ్ రోడ్డు నిర్మాణానికి మంత్రి భరత్ శ్రీకారం చుట్టాడని ఇవి రెండు పూర్తి అయితే నగరంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఉంటుందని అన్నారు. అలాగే సొంత నిధులతో రెడ్ క్రాస్ భవన సముదాయంలోనే తల సేమియా వ్యాధిగ్రస్తుల కొరకు ప్రత్యేక భవనాన్ని కోటి రూపాయలతో నిర్మిస్తున్నామని దానికి మంత్రి టీజీ భరత్ ఈరోజే శంకుస్థాపన చేశారని ఆయన తెలిపారు. నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, కర్నూలు అభివృద్ధికై పాటుపడుతున్న తమను నగర ప్రజలు గుర్తించి ఆదరించాలని టీజీ వెంకటేష్ కోరారు

## ఎన్ బి కె ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఆచార్యురాలికి అంతర్జాతీయ అవార్డు



కోట :మే 16 (శ్రీ చక్ర):చండీఘర్ కేంద్రంగా ఉన్నత లక్ష్యాలు కలిగిన ఇండో- సెర్బియన్ అంతర్జాతీయ సంస్థ ఇంటర్నేషనల్ అకాడెమీ ఆఫ్ ఎథిక్స్ ఇప్పటి వరకు విశ్వ వ్యాప్తంగా 50 మంది మేధావులకు ఫెలోషిప్ ఇచ్చింది.వందలాది మందికి రోల్ ఆఫ్ ఆనర్, డిస్టింగ్విషెడ్ స్కాలర్ లాంటి గౌరవాలు ఇచ్చింది.మే నెలలో 11 వ తేదీన అంతర్జాల వేదికలో ఒడిశా ప్రసిద్ధ కవి రమాకాంత్ దాస్ కు, బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన తెలుగు రచయిత్రి శ్రీమతి శైలజా మిత్ర కు ప్రతిష్టాత్మక ఫెలోషిప్ ను అందించారు వ్యవస్థాపకుడు డాక్టర్ జర్నైల్ సింగ్ ఆనంద్. తమిళ రచయిత్రి మధుమిత, ఆంగ్ల రచయిత్రి డా సరోజాదేవి, ఒడియా రచయిత్రి మోనాలిసా జెనా, మణిపురి రచయిత్రి డాక్టర్ ఇభేమల్, పంజాబీ రచయిత్రి రజని చబ్బ లకు డిస్టింగ్విష్డ్ స్కాలర్ అవార్డు ప్రదానం చేశారు.. అనంతరం కవి సమ్మేళనంలో అవార్డు గ్రహీతలు తమ స్పందన, కవితలు వినిపించారు..ఆ అంతర్జాలం ద్వారా వచ్చిన ప్రతిష్టాత్మక అవార్డు ఈ రోజు కోట మండలం విద్యానగర్ లోని ఎన్ బి కె ఆర్ విద్యాసంస్థల చైర్మన్ నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి ద్వారా అందుకోవడం జరిగింది. తమ ఇంజనీరింగ్ కళాశాల ఆచార్యులు డాక్టర్ సరోజదేవి ఇలా అంతర్జాతీయ స్థాయిలో అవార్డు అందుకున్న ఘనతకు ఆయన ఆమెను అభినందించారు.

## కల్లూరు వార్డుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలి

## పాణ్యం నియోజకవర్గ ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి



కర్నూలు, మే 16 (శ్రీచక్ర): నగర పరిధిలో ఉన్న కల్లూరు వార్డుల అభివృద్ధికి నగరపాలక అధికారులు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని పాణ్యం నియోజకవర్గ ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి సూచించారు. శనివారం స్థానిక ఎస్బీఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో నగరపాలక కమిషనర్ చల్లా ఓబులేసుతో కలిసి నగరపాలక అధికారులతో సమావేశం నిర్వహించారు. కల్లూరు వార్డుల వారీగా జరుగుతున్న అభివృద్ధి పనులు, పెండింగ్ సమస్యలు, ప్రజల అవసరాలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వార్డుల వారీగా కాకుండా జనాభా ప్రాతిపదికన నిధులను కేటాయించడం ద్వారా ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు సమర్థవంతంగా అందించవచ్చని పేర్కొన్నారు. పార్కు స్థలాలకు ఫెన్సింగ్ వేసి వాటిని పరిరక్షించాల్సిన అవసరం ఉందని, 340 సి రహదారి విస్తరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే చెక్‌పోస్ట్ నుండి సఫా కళాశాల వైపునకు నగరపాలక పరిధిలో వరకు డ్రైన్ నిర్మాణానికి తక్షణమే నిధులు కేటాయించాలని సూచించారు. శంకుస్థాపన చేసిన అభివృద్ధి పనులు ఆలస్యం కాకుండా వేగంగా పూర్తి చేయాలని, తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించి ప్రతిరోజూ నీటి సరఫరా జరిగేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. వేసవి దృష్ట్యా బోర్లు మరమ్మత్తులు చేపట్టాలన్నారు. అదేవిధంగా అధ్వానంగా ఉన్న రహదాం ఎలపై కనీసం గ్రావెల్ రోడ్లు నిర్మించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని తెలిపారు.విద్యుత్‌దీపాలమరవ ఎత్తులు,స్తంభాలమా ర్పునకు చర్యలు తీసుకోవా లని సూచించారు. కల్లూరు వార్డుల్లో సమస్యలు అధికంగా ఉన్నం దున అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయా లు అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి స్పష్టం చేశారు. సమావేశంలో అదనపు కమిషనర్ ఆర్‌జివి కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, కార్యదర్శి నాగరాజు, మేనేజర్, ఆర్వో జునైద్, ఇంచార్జీ సిటీ ప్లానర్ వై.వి. వెంకటరమణ, ఎస్ఈ రవ ఎణ మూర్తి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం. రఘు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా టీజీ వెంకటేష్ జన్మదిన వేడుకలు









కర్నూలు, మే 16 (శ్రీచక్ర): మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ జన్మదిన వేడుకలు శనివారం కర్నూలు నగరంలో ఘనంగా జరిగాయి. స్థానిక సంకల్బాగ్ నందు ఉన్న టీజీ స్వగృహానికి వేలాదిమంది అభిమానులు, ప్రజాసంఘాల నాయకులు, అధికారులు, రాజకీయ నాయకులు చేరుకుని టీజీ వెంకటేష్ కు శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుండి ఆర్యవైశ్య నాయకులు తరలివచ్చి టీజీ వెంకటేష్ పై తమ అభిమానాన్ని తెలుపుతూ గజమాలతో సత్కరించారు.

## పెద్దకడబూరులో విజయవంతమైన స్వచ్చంద్ర స్వర్ణాంధ్ర కార్యక్రమం,




పెద్దకడబూరు, ఏప్రిల్, 16 (శ్రీ చక్ర): - పెద్దకడబూరు మండలంలోని స్వచ్చంద్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని పెద్దకడబూరులోని ఎమ్మిగనూరు రోడ్డు వంక దగ్గర స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని ఎంపీడీవో, ఈవోఆర్డీ ఆధ్వర్యంలో చేపట్టడం జరిగినది. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్రరైతు అధికార ప్రతినిధి నరవ రమాకాంత్ రెడ్డి మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి ఒక్కరూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చెత్త చెదా రమంతా మీ ఇండ్లదగ్గరకు వచ్చిన చెత్త బండి లోనే వేయాలని అప్పుడే మన గ్రామాలు పరిశుభ్రంగా ఉంటాయని తెలిపారు. గ్రామాల అభివృద్ధిలో పరిశుభ్రతే, మన ప్రజల ఆరోగ్య పరిశుభ్రతకు దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మీసేవ ఆంజనేయులు, బిసి సాధికారిక సమితి సభ్యులు మల్లికార్జున, డీలర్ కుంటి ఈరన్న, ఏపీవో చంద్రశేఖర్, సాక్షర భారత్ కోఆర్డినేటర్ నారాయణ,పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

## మెట్టెల తిరుపతమ్మ ని పరామర్శించిన మాజి ఎమ్మెల్యే అన్నా.

మార్కాపురం మే 16 ( శ్రీ చక్ర)మార్కాపురం పట్టణంలోని శ్రీ ఆరోగ్య హాస్పిటల్ నందు తర్లుపాడు మండలం పోతలపాడు గ్రామ మాజి సర్పంచ్ మెట్టెల అంజయ్య మాతృమూర్తి గారు తిరుపతమ్మ ఇటీవల అనారోగ్యనికి గురై హాస్పిటల్ నందు చికిత్స పొందుతుండగా విషయం తెలుసుకున్న గిద్దలూరు మాజి.శాసనసభ్యులు,మార్కాపురం నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఇంచార్జి అన్నా రాంబాబు తిరుపతమ్మని పరామర్శించి డాక్టర్ లకు మెరుగైన వైద్యం అందించాలని కోరడం జరిగింది.



శ్రీచక్ర

ఆదివారం 17-05-2026

# పార్టీ అభివృద్ధికి కృషి చేయండి.. డాక్టర్ షేక్ మహబూబ్ వలి పిలుపు

## కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి ప్రకాశం జిల్లా మైనార్టీ సెల్ చైర్మన్.



మార్కాపురం మే 16( శ్రీ చక్ర)మార్కాపురం..కాంగ్రెస్ పార్టీ పూర్వ వైభవానికి శక్తి వంచన లేకుండా కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి ప్రకాశం జిల్లా మైనార్టీ సెల్ చైర్మన్ డాక్టర్ షేక్ మహబూబ్ వలీ తెలిపారు.శనివారం న పట్టణంలోని తన కార్యాలయం నందు తర్లుపాడు మండల మైనార్టీ సెల్ చైర్మన్గా తుమ్మల చెరువుగ్రామానికి చెందినసయ్యద్ రహమతుల్లాను.నియమించారు. ఈ మేరకు రెహమతుల్లాకు డాక్టర్ షేక్ మహబూబ్ వలీ నియామక పత్రం అందజేశారు.ఈ నేపథ్యంలో డాక్టర్ షేక్ మహబూలి వలి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, మైనార్టీల సంక్షేమానికి కట్టుబడి పని చేయాలని పేర్కొన్నారు.పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు..వెనుకబడిన ప్రాంతమైన పశ్చిమ ప్రకాశంలో ఉన్న సమస్యలపై పోరాటం చేస్తూ ప్రజా గొంతుకై నిలవాలని కోరారు..తద్వారా పార్టీ సామాన్యులకు కూడా చేరుతుందని పేర్కొన్నారు.. అనంతరం రెహమతుల్లా మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యతలను అప్పగించిన డాక్టర్ షేక్ మహబూబ్ వలి కి ప్రత్యేక కృతజ్ఞతలను తెలిపారు.. తనకు అప్పజెప్పిన ఈ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు..

# ప్లాస్టిక్ ని నిషేధించి పర్యావరణాన్ని కాపాడండి స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ప్రతిజ్ఞ





కాజులూరు ఎంపీడీవో రాంబాబు. కాజులూరు, మే 16( శ్రీచక్ర)ప్లాస్టిక్ నిషేధించి పర్యావరణాన్ని కాపాడాలని కాజులూరు మండల అభివృద్ధి అధికారి జె. రాంబాబు సూచించారు ఈ మేరకు శనివారంస్వచ్ఛ ఆంధ్ర ? స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా కాజులూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయం, కాజులూరు గ్రామ పరిసర ప్రాంతాల్లో ప్లాస్టిక్ వస్తువులను నిషేదించి పర్యావరణాన్ని కాపాడాలి అనే నినాదంతో ఎంపీడీవో జె. రాంబాబు ఆధ్వర్యంలో ర్యాలి నిర్వహించి సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిర్మూలన చర్యలు, క్లాత్ బాగ్స్ మరియు పునర్వినియోగ వస్తువుల వినియోగం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ కాజులూరు మెయిన్ రోడ్ కూడలి నందు వివిధ శాఖల అధికారుల సిబ్బందితో మానవహారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ పరిపాలనా అధికారి ఆర్. పద్మలత, మండల విద్య శాఖ అధికారులు డేవిడ్,జాన్ లతో పాటు మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, ఉపాధి హామీ కార్యాలయ సిబ్బంది, వెలుగు సిబ్బంది , కాజులూరు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వరి పొలల్లో గడ్డికి నిప్పు పెట్టి కాల్చడాన్ని నిలుపుదల చేయాలి.ఆర్డీవోకు జనసేన శ్రేణులు ఫిర్యాదు.

రామచంద్రపురం, మే 16 (శ్రీచక్ర)రామచంద్రపురం నియోజకవర్గంలో చాలా చోట్ల వరి పంట కోత తర్వాత వదిలివేసిన గడ్డి కాండాన్ని పొలంలో నిప్పు పెట్టి కాల్చడంసమాజానికి తీవ్ర నష్టంవాటిల్లుతుందని ఈ విషయంలో నివారణ చర్యలు తీసుకోవాలని రామచంద్రపురం ఆర్డీవో ఏ. సరళావతికి పలువురు జనసేన శ్రేణులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ మేరకు శనివారంఈ విషయంపై ఆర్డిఓ కార్యాలయంలో సరళావతిని కలిసి సమన్యనువివరించిగడ్డినికాల్చడంపైవచ్చేఅనర్థాలను ఆర్డిఓకు తెలియజేశారు.వరి పంట కోత తర్వాత మిగిలిన కొయ్యలు లేదా కాండాన్ని కాల్చివేయడం వల్ల నేల సారవంతం పోయి భూమి సహజ గుణం మరుగున పడే అవకాశం ఉందని దీనివల్ల నేల ఉష్ణోగ్రత పెరిగి పంటలకు మేలు చేసే సూక్ష్మజీవులు నశిస్తాయని, అదేవిధంగా మానవాళికి వాయు కాలుష్యం పెరిగి తీవ్రమైన జబ్బులు వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. భూసారం తగ్గి వ్యవసాయ పరమైన నష్టాలు శాస్త్రీయంగా ఏవిధంగా ఉంటాయనేది తెలియజేశారు .సేంద్రీయ కార్బన్ నాశనం నేలసారం తగ్గిపోవడానికి కారణం భూమి లో ఉండే నత్రజని భాస్వరం పొటాషియం మారుతుందని భూమికి నీటిని నిలుపుకునే శక్తి తగ్గిపోయి , పంట ఎండిపోయే అవకాశం ఉంటుందని ఒక రకమైన వాయు తమరి యొక్క ఆదేశాలతో అరికట్టే విధానం చేయాలని, రామచంద్రపురం నియోజకవర్గ జనసేన పార్టీ తరఫున ఆర్డీవోకు ఒక వినతి పత్రాన అందజేసినట్లు పేర్కొన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో జనసేన నాయకులు కొండ్రెడ్డి శ్రీనివాసురావు, సత్యవాడ శ్రీహరి పంతులు, మట్టా దుర్గారావు, పడాల లోవరాజు, తదితరులు ఉన్నారు.

# కల్లూరు కొత్తపాలెంలో కొత్తగా నిర్మితమైన శ్రీశ్రీశ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమం...,

**దువ్వూరు జనార్దన్ రెడ్డి ఆహ్వానం మేరకు శ్రీవారి పూజకు హాజరైన వైసీపీ అఇఅ సభ్యుడు పేర్నాటి శ్యాం ప్రసాద్ రెడ్డి...,**

**విద్యానగర్ నుండి కల్లూరు కొత్తపాలెంలో శ్రీ వెంకటేశ్వర స్వామి గుడి వరకు పాదయాత్ర చేసిన దువ్వూరు జనార్దన్ రెడ్డి..,**



కోట : మే 16 (శ్రీ చక్ర): వాకాడు మండలంలోని కల్లూరు కొత్తపాలెం పంచాయతీలో టీడీపీ ముఖ్య నాయకులు,ప్రముఖ పారిశ్రామికవేత్త దువ్వూరు జనార్దన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్మాణం పూర్తిచేసుకున్న శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో నేడు ఉదయం ప్రత్యేక పూజా కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది.ఈ పుణ్యకార్యానికి ఆయన ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా వైసీపీ నేత, అల్లంపాడు గ్రామానికి చెందిన పేర్నాటి. శ్యాంప్రసాద్ రెడ్డి హాజరై కన్నుల పండుగ చేశారు. పేర్నాటి శ్యాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ భక్తిశ్రద్ధలతో లక్షలు వెచ్చించి ఆలయాన్ని నిర్మించిన దువ్వూరు జనార్దన్ రెడ్డిని అభినందిస్తూ పూజా కార్యక్రమానికి తన కుటుంబాన్ని ఆహ్వానించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.అలాగే గ్రామ ప్రజల చిరకాల కోరిక నెరవేర్చడం జనార్దన్ రెడ్డి అదృష్టం అని,స్వామివారి కృప ఆయన కుటుంబంపైనా,మనందరిపైనా ఉండాలని ఆయన ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఆలయ నిర్మాణం పూర్తయి, వేలాది మంది భక్తుల సమక్షంలో పూజలు జరగడంతో జనార్దన్ రెడ్డి ఆనందానికి హద్దులు లేకుండా పోయాయని,ఆయన సేవా దృక్పథం ను గ్రామస్తులు,భక్తులు కొనియాడారు.అలాగే వాకాడు మండలం టీడీపీ సీనియర్ నాయకులు సన్నారెడ్డి విజయ శేఖర్ రెడ్డి పూజా కార్యక్రమానికి హాజరై భక్తులతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. పార్టీలకు అతీతంగా పేర్నాటి, సన్నారెడ్డి,దువ్వూరు నేతలు ఒకే వేదికపై దైవ సన్నిధిలో మాట్లాడుకుంటూ కనిపించడంతో భక్తులు హర్షం వ్యక్తం చేశారు.ఉదయం నుంచి జరిగిన ప్రత్యేక పూజలు,హోమాల్లో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఆలయాన్ని పూలతో,విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. వచ్చిన భక్తులందరికీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. దువ్వూరు జనార్దన్ రెడ్డి స్వయంగా అందరినీ పలకరిస్తూ, ఏర్పాట్లను పర్యవేక్షించారు.ఈ కార్యక్రమంలో పేర్నాటి దంపతులు పేర్నాటి సుష్మిత,వైసీపీ సీనియర్ నాయకులు పాదర్తి రాధాకృష్ణా రెడ్డి,మాజీ శ్రీ కనుపూరు ముత్యాలమ్మ పాలక సభ్యులు దువ్వూరు సాయి కృష్ణా రెడ్డి, చిల్లకూరు వెంకు రెడ్డి,వలువురు నాయకులు ఉన్నారు.

# కృష్ణ చైతన్య ఆధ్వర్యంలో తొలి ఆటోనమస్ బ్యాచ్ ఫలితాల విడుదల విద్యార్థుల భవిష్యత్ అభివృద్ధికి మరిన్ని అవకాశాలు



మార్కాపురం మే 16 (శ్రీ చక్ర)మార్కాపురం: కృష్ణ చైతన్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ కిడ్స్,. మార్కాపురం స్వయం ప్రతిపత్తి (అడ్మిషన్ ) హోదా సాధించిన అనంతరం నిర్వహించిన తొలి విద్యా పరీక్షల ఫలితాలను.కళాశాలకార్యాలయంలో ఘనంగా విడుదల చేశారు. సంస్థ స్వయం ప్రతిపత్తి పొందిన తరువాత నిర్వహించిన మొట్టమొదటి బి.టెక్ ప్రథమ సంవత్సరం మరియు ఎం.టెక్ ప్రథమ సంవత్సరం తొలి ఆటోనమస్ బ్యాచ్ ఫలితాలు అధికారికంగా విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమం కళాశాల చరిత్రలో.ఒకప్రత్యేక.ఘట్టంగా.నిలిచిందనికళాశాల కార్యదర్శి మరియు కరస్పాండెంట్ శ్రీ కృష్ణ చైతన్య గారు తెలిపారు. ×ఆటోనమస్ హోదాతో విద్యా ప్రమాణాల్లో నూతన మార్పులుఈ సందర్భంగా కృష్ణ చైతన్య మాట్లాడుతూ, స్వయం ప్రతిపత్తి హోదా ద్వారా విద్యార్థులకు మరింత నాణ్యమైన విద్య అందించే అవకాశాలు విస్తరించాయని తెలిపారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా రూపొందించిన సిలబస్, ప్రాక్టికల్ ఆధారిత బోధన, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన శిక్షణ విధానాలు విద్యార్థుల భవిష్యత్తుకు మరింత ఉపయోగపడతాయని పేర్కొన్నారు.విద్యార్థులు కేవలం అకాడమిక్ ఫలితాలకే పరిమితం కాకుండా, ఉద్యోగ అవకాశాలు, పరిశోధన రంగం, ఉన్నత విద్యా అవకాశాలు మరియు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తమ నైపుణ్యాలను.పెంపొందించుకోవాలని సూచించారు.విద్యార్థుల సమగ్ర అభివృద్ధే లక్ష్యం×కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. కృష్ణ రెడ్డి మాట్లాడుతూ, ఆటోనమస్ విధానం ద్వారా విద్యార్థులకు నూతన విద్యా పద్ధతులు, ఆధునిక సిలబస్, నిరంతర మూల్యాంకన విధానం అమలు చేస్తున్నామని తెలిపారు.అంతేకాకుండా విద్యార్థులలో సాంకేతిక నైపుణ్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్, సమస్యల పరిష్కార సామర్థ్యం మరియు ఉద్యోగ.అవకాశాలకు.అవసరమైన అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు.పరీక్షల.నిర్వహణలో.పారదర్శకతకు ప్రాధాన్యత.ఈ సందర్భంగా వైస్.ప్రిన్సిపాల్.డా.రంగనాయకులు , కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ కిషోర్ × మాట్లాడుతూ, ఆటోనమస్ విధానంలో పరీక్షల నిర్వహణ పూర్తిస్థాయి పారదర్శకతతో జరిగిందని తెలిపారు.పరీక్షల నిర్వహణ, మూల్యాంకన విధానాలు అత్యున్నత ప్రమాణాలతో అమలు చేయబడినట్లు పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి ప్రతిభకు తగిన గుర్తింపు లభించేలా అన్ని చర్యలు తీసుకున్నట్లు వివరించారు.విద్యార్థుల విజయానికి అధ్యాపకుల నిరంతర కృషిసి.ఎస్.ఈ విభాగాధిపతి ×డా. అనిల్ మాట్లాడుతూ, విద్యార్థుల మెరుగైన ఫలితాల కోసం అధ్యాపకులు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రత్యేక తరగతులు, మెంటరింగ్ విధానం, విద్యార్థుల పురోగతిపై నిరంతర పర్యవేక్షణ ద్వారా మరింత నాణ్యమైన ఫలితాలను సాధించడానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు.కార్యక్రమంలో పాల్గొన్నవారు.ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి మరియు కరస్పాండెంట్ శ్రీ కృష్ణ చైతన్య ప్రిన్సిపాల్ డా. వి. కృష్ణ రెడ్డి , వైస్ ప్రిన్సిపాల్ డా. రంగనాయకులు గారు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ కిషోర్ సి.ఎస్.ఈ హెచ్.ఓ.డి డా. అనిల్ , అధ్యాపకులు మరియు కళాశాల సిబ్బంది పాల్గొన్నారుకృష్ణ చైతన్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ మార్కాపురం స్వయం ప్రతిపత్తి అనంతరం తొలి ఆటోనమస్ బ్యాచ్ బి.టెక్, ఎం.టెక్ ప్రథమ సంవత్సరం ఫలితాలను విడుదల చేస్తున్న కార్యదర్శి మరియు కరస్పాండెంట్ శ్రీ కృష్ణ చైతన్య , ప్రిన్సిపాల్ డా. వి. కృష్ణ రెడ్డి , వైస్ ప్రిన్సిపాల్ డా. రంగనాయకులు , కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ కిషోర్ మరియు ఇతర అధ్యాపకులు.

# జాతీయడెంగ్యూ దినోత్సవం సందర్భంగ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించిన ఎమ్మెల్యే కందుల కలెక్టర్ విజయ సునీత





మార్కాపురం మే 16 ( శ్రీ చక్ర ( మార్కాపురం శాసనసభ్యులు గౌరవనీయుల.కందుల నారాయణ రెడ్డి మరియు గౌరవ జిల్లా కలెక్టర్ మరియు డిస్టిక్ మేజిస్ట్రేట్ శ్రీమతి ఎం. విజయ సునీత డెంగ్యూ దినోత్సవ.పోస్టర్లను.ఆవిష్కరించారు. తదనంతరం సంయుక్తంగా జండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీ కార్యక్రమము ఆర్డిఓ ఆఫీసు నుండి.కోర్టు.సెంటర్.కూడలి.వరకు .నిర్వహించబడింది.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సమాజ భాగస్వామ్యంతో డెంగ్యూ నిర్మూలించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని అన్నారు. దోమల ద్వారా వచ్చే వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని,డెంగు కారక దోమ చాలా ప్రమాదకరమని, ప్రాణాంతకమని తెలియజేశారు. అనంతరం కోర్టు సెంటర్ కూడలిలో మానవహారం ఏర్పాటు చేసి ర్యాలీలో పాల్గొన్న వారితో డెంగ్యూ నివారణలో భాగస్వాములౌతామని గౌరవ శాసనసభ్యులు కందుల నారాయణ రెడ్డి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజ భాగస్వామ్యంతో డెంగ్యూ వ్యాధి నివారణ సాధ్యమని మనమందరం కూడా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకొని దోమలను నిర్మూలించడం ద్వారా డెంగు వ్యాధిని అరికట్టవచ్చునని తెలియజేశారు,ముఖ్యంగా ఇంటి పరిసరాలలో మంచినీటి నిలువలు లేకుండా చూసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి గారైన డాక్టర్ ః.మనస్సే మాట్లాడుతూ డెంగు వ్యాధి అనేది ఏడిస్ ఈజిప్ట్ దోమ కుట్టడం ద్వారా డెంగ్యూ వ్యాధి వ్యాపిస్తుందని, దోమలు పెరగకుండా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఫ్రైడే ఫ్రైడే పాటించాలని తెలియజేశారు.. డెంగ్యూ వ్యాధి లక్షణాలైన తీవ్రమైన జ్వరం, తలనొప్పి, వంటిమీద దద్దుర్లు, కండరాల నొప్పి, తలనొప్పి, వాంతులు, కంటి వెనక భాగంలో నొప్పి,రక్త కణాలు తగ్గిపోవడం వంటి లక్షణాలను అశ్రద్ధ చేయకుండా సకాలంలో సరైన చికిత్స చేయించుకోవాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ కె.రాహుల్ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ రెవిన్యూ ఆఫీసర్ శ్రీ శివరామిరెడ్డి మార్కెట్ యార్డ్ చైర్మన్ వెంకట రెడ్డి జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారిని డాక్టర్ ఏ సృజన , వైద్యాధికారిని డాక్టర్ అనూష , అసిస్టెంట్ మలేరియా అధికారి సీనయ్, మరియు మార్కాపురం సబ్ యూనిట్ అధికారి ఆర్ నాగేంద్ర రెడ్డి మరియు దోర్నాల అధికారి కే ఇశ్రాయేలు , ఓజూష్ట్రవనీ ః. శ్రీకాంత్ ,మహిళ ఆరోగ్య పర్యవేక్షకులు శ్రీమతి ఎం సాయి గీత, ః. రూత్ మేరీ కె ఎం. విజయలక్ష్మి కుమారి మరియు మార్కాపురం పట్టణము మరియు రూరల్లోపనిచేయుచున్నటువంటి మగ ఆరోగ్య కార్యకర్తలు మరి ఏ ఎన్ ఎం ఆషా కార్యకర్తలు మరియు టీబీ సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఒకే ఇంట్లో తల్లి కూతుళ్లకు రెండు రాష్ట్ర డైరెక్టర్ పదవులు.ఇదేనా పార్టీ ఇంటిలిజెన్సీ పనితీరు. 25 ఏళ్లుగా పనిచేసిన వారికి మొండి చేయి. పార్టీ పనితీరు పట్ల క్యాడర్లో అసంతృప్తి. అధిష్టానానికి తప్పుడు సంకేతాలు ఇస్తున్నారు.టిడిపి క్లస్టర్ ఇన్చార్జి ఇంట్లోనే రెండు రాష్ట్ర డైరెక్టర్ పదవులు.



రామచంద్రపురం, మే 16( శ్రీచక్ర)ఇటీవల నాటక అకాడమిలో రాష్ట్రవ్యాప్తంగా 25 మంది డైరెక్టర్లను ప్రకటించగా అందులో రామచంద్రపురం నియోజకవర్గంలో ఒకే కుటుంబానికి చెందిన తల్లి కూతుర్లకు చెరో పదవి ఒకే శాఖలో రాష్ట్ర నాటక అకాడమిలో స్టేట్ డైరెక్టర్లుగా ప్రకటించడంతో పార్టీ ఇంటిలిజెన్స్ పనితీరును తప్పుపడుతూ ఆపార్టీ క్యాడర్ అసంతృప్తిని వ్యక్తం చేస్తుంది. దీంతో ఒకే సామాజిక వర్గంలో ఒకే కుటుంబంలో రెండు రాష్ట్ర డైరెక్టర్ నామినేటెడ్ పదవులు ప్రకటించడం తెలుగుదేశం పార్టీ గొప్పదనం తేట తెల్లమవుతుంది. ఇలా ఇవ్వడం పార్టీ ఇంటిలిజెన్సీ పనితీరుకు పార్టీలో విలువలు దిగజారుతున్నాయి అనేటువంటిదానికి సాంకేతంగా నిలుస్తుంద అని ఆపార్టీకి చెందిన పలువురు సీనియర్ నేతలు అభిప్రాయపడుతున్నారు. దీంతో పార్టీలో సుధీరకాలం నుండి జెండా మోసిన నేతలకు గుర్తింపు లేకుండా పోవడానికి ఇదే నిదర్శనంగా చెప్పవచ్చు అని ఆ పార్టీకి చెందిన కేడర్ గుర్రుగా ఉంది . సుమారు 25 సంవత్సరాల నుండి ఆ పార్టీ జెండా మోస్తూ కష్టకాలంలో ఆర్థికంగా కూడా సపోర్ట్ చేసిన సీనియర్ నేతలకు సైతం పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ ఏ విధమైన పదవులు ఇవ్వక పోయినప్పటికీ ఇలా ఒకే కుటుంబంలో ఒకే సామాజి వర్గానికి రెండు పదవులు కట్టబెట్టడం సీనియర్ టిడిపి నేతలకు అవమానంగానే ఉందని పలువురు అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.క్లస్టర్ ఇన్చార్జి ఇంట్లోనే రెండూ రాష్ట్ర డైరెక్టర్ పదవులు.రామచంద్రపురం నియోజకవర్గం ద్రాక్షారామం కు చెందిన టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ పెంకే సాంబశివరావు భార్య పెంకె అన్నపూర్ణ, ఆయన కుమార్తె వెంకే ప్రతిభా భారతి లకు రాష్ట్ర నాటక అకాడమీ ప్రకటించిన 25 డైరెక్టర్ పదవుల్లో రెండు పదవులు రామచంద్రపురం నియోజవర్గానికిలో బీసీ సామాజిక వర్గానికి చెందిన ఈ ఇద్దరిని ప్రకటించడం జరిగింది.దీంతో విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ శ్రేణుల్లో అసంతృప్తి నెలకొని నియోజవర్గంలో అసలు తెలుగుదేశం పార్టీకి పూర్తిస్థాయిలో పనిచేసిన కార్యకర్తలకు కానీ సీనియర్లు కానీ విలువ లేకుండా పోయిందని బాహాటంగానే చెప్పుకుంటున్నారు. ఇదిలా ఉండగా నియోజవర్గం నుండి పార్టీ అధిష్ఠానానికి తప్పుడు సంకేతాలు వెళ్తున్నాయనేది స్పష్టంగా అర్థం అవుతుందని పలువురు టిడిపి సీనియర్ నేతలు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

# పాలల్లో ఇవి నానబెట్టి తీసుకుంటే ఊహించని శక్తి.. అసలు సంగతి తెలిస్తే!



ఖర్జూరాలను పాలల్లో నానబెట్టి తినడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు అనేకం ఉన్నాయి. ఖర్జూరాలు , పాలు రెండూ పోషకాలతో నిండిన ఆహారాలు, వీటిని కలిపి తీసుకోవడం వల్ల ఆరోగ్యం మరింత మెరుగుపడుతుంది. ఈ కలయిక శరీరానికి శక్తినివ్వడమే కాకుండా అనేక వ్యాధుల నుండి రక్షించడంలో సహాయపడుతుంది. శక్తిని పెంచుతుంది: ఖర్జూరాలు , పాలు రెండూ శక్తిని పెంచే ఆహారాలు. ఖర్జూరాలలో ఉండే సహజ చక్కెరలు తక్షణ శక్తిని అందిస్తాయి, అయితే పాలలో ఉండే ప్రోటీన్ , ఇతర పోషకాలు శక్తి స్థాయిలను ఎక్కువసేపు నిలబెట్టడానికి సహాయపడతాయి. ఉదయం ఖర్జూరాలను పాలలో నానబెట్టి తినడం వల్ల రోజంతా శక్తివంతంగా ఉండవచ్చు. పాలలో లాక్టోజ్ ఉంటుంది, ఇది జీర్ణక్రియకు సహాయపడుతుంది. ఖర్జూరాలలో ఉండే ఫైబర్ మలబద్ధకాన్ని నివారిస్తుంది మరియు ప్రేగు కదలికలను మెరుగుపరుస్తుంది. ఎముకలను బలోపేతం చేస్తుంది: పాలు కాల్షియం , విటమిన్ డి కి గొప్ప మూలం, ఇవి ఎముకల ఆరోగ్యానికి చాలా అవసరం. ఖర్జూరాలలో పొటాషియం , మెగ్నీషియం వంటి ఖనిజాలు కూడా ఉన్నాయి, ఇవి ఎముకల సాంద్రతను పెంచడానికి సహాయపడతాయి. ఈ రెండింటి కలయిక ఎముకలను బలంగా , ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. బరువు పెరగడానికి సహాయపడుతుంది: ఖర్జూరాలు మరియు పాలు రెండూ కేలరీలు మరియు పోషకాలు అధికంగా ఉండే ఆహారాలు. బరువు పెరగాలనుకునే వారికి లేదా తక్కువ బరువు ఉన్నవారికి ఈ కలయిక చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఆరోగ్యకరమైన రీతిలో బరువు పెరగడానికి ఖర్జూరాలను పాలలో నానబెట్టి తినడం నిద్ర నాణ్యతను మెరుగుపరుస్తుంది: పాలలో ట్రిప్టోఫాన్ అనే అమైనో ఆమ్లం ఉంటుంది, ఇది నిద్రను ప్రోత్సహించే హార్మోన్ అయిన మెలటోనిన్ ఉత్పత్తికి సహాయపడుతుంది. ఖర్జూరాలలో మెగ్నీషియం ఉంటుంది, ఇది కండరాలను సడలించడానికి, నిద్రను మెరుగుపరచడానికి సహాయపడుతుంది. రాత్రి పడుకునే ముందు ఖర్జూరాలను పాలలో నానబెట్టి తినడం వల్ల నిద్ర నాణ్యతను మెరుగుపరచవచ్చు. చర్మం , జుట్టు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది: ఖర్జూరాలలో యాంటీఆక్సిడెంట్లు మరియు విటమిన్లు ఉన్నాయి, ఇవి చర్మ కణాలను దెబ్బతినకుండా కాపాడతాయి , చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. పాలలోని విటమిన్లు , ప్రోటీన్లు జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తాయి ,జుట్టును బలంగా ఉంచుతాయి. రోగనిరోధక శక్తిని పెంచుతుంది: ఖర్జూరాలు , పాలు రెండూ రోగనిరోధక శక్తిని పెంచే పోషకాలను కలిగి ఉంటాయి. ఖర్జూరాలలో యాంటీఆక్సిడెంట్లు , విటమిన్లు రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేయడానికి సహాయపడతాయి. పాలలో విటమిన్ డి , ఇతర పోషకాలు కూడా రోగనిరోధక శక్తిని పెంచడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. ఎలా తీసుకోవాలి: గర్భిణీ స్త్రీలకు అవసరమైన పోషకాలు ఖర్జూరాలు, పాలలో పుష్కలంగా ఉంటాయి. పాలిచ్చే తల్లులకు ఇది శక్తిని అందిస్తుంది . వీటిని ప్రతి రోజూ తీసుకుంటే ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. 2-3 ఖర్జూరాలను రాత్రివూట ఒక గ్లాసు పాలలో నానబెట్టండి. మీరు కావాలనుకుంటే, ఖర్జూరాలను మెత్తగా చేసి పాలలో కలిపి కూడా తీసుకోవచ్చు. రుచి కోసం కొంచెం తేనె లేదా యాలకుల పొడిని కూడా కలపవచ్చు. ప్రతి రోజూ ఉదయం లేదా సాయంత్రం దీనిని తీసుకోవచ్చు. అయితే డయాబెటిస్ ఉన్నవారు లేదా రక్తంలో చక్కెర స్థాయిలు ఎక్కువగా ఉన్నవారు ఖర్జూరాలను మితంగా తీసుకోవాలి, ఎందుకంటే వాటిలో చక్కెరలు ఎక్కువగా ఉంటాయి. పాలు పడని వారు లేదా లాక్టోస్ అసహనం ఉన్నవారు పాల బదులు బాదం పాలు లేదా సోయా పాలు వంటి ప్రత్యామ్నాయాలను ఉపయోగించవచ్చు. ఏదైనా ఆహారాన్ని అధికంగా తీసుకోవడం ఆరోగ్యానికి మంచిది కాదు. పాలల్లో నానబెట్టిన ఖర్జూరాలను కూడా తీసుకోవడం ఉత్తమం.

# ఈ సాధారణ అలవాట్లతో ఆరోగ్యానికి డేంజర్... మార్చుకోకుంటే అంతే సంగతి!



చాలామంది ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటారు. అయితే ఆరోగ్యంగా ఉండాలి అనుకునేవారు ఆరోగ్యకరమైన అలవాట్లను కూడా చేసుకోవాలి. కానీ మనకు తెలియకుండానే మనం అనేక అనారోగ్యకరమైన అలవాట్లను చేసుకుంటున్నాం. ఇవి మన ఆరోగ్యాన్ని నాశనం చేస్తాయి. సైలెంట్ కిల్లర్ లాగా మన ఆరోగ్యం మీద ప్రభావాన్ని చూపిస్తాయి. మరి అటువంటి అనారోగ్యకరమైన అలవాట్లను గురించి ప్రస్తుతం మనం తెలుసుకుందాంసాధారణంగా మన ఈ అలవాటుతో డేంజర్ మనలో చాలామంది రోజు కొన్ని పనులకు అలవాటు పడిపోయి ఉంటారు. అవి కాలక్రమేణా మనకు తెలియకుండానే మన ఆరోగ్యాన్ని పాడుచేస్తున్నాయి. మన ఆరోగ్యాన్ని రహస్యంగా దెబ్బతీసే సాధారణమైన చెడు అలవాట్లను గురించి ప్రస్తుతం మనం తెలుసుకుందాం. చాలామంది ఎక్కువసేపు కూర్చుంటూ ఉంటారు. ఎక్కువసేపు కూర్చోవడం వల్ల గుండెజబ్బులు, డయాబెటిస్, కొన్ని రకాల క్యాన్సర్లు దీర్ఘకాలికవ్యాధులు వచ్చే ప్రమాదం ఉంటుంది. ఆరోగ్యంగా ఉండాలనుకునే వారు ఎక్కువ సేపు కూర్చోవడం మంచిది కాదు. ఈ వినియోగం తగ్గించండి చాలామంది ఆహారంలో అధికంగా చక్కెరను వినియోగిస్తూ ఉంటారు. దీనివల్ల ఊబకాయ బాధితులుగా మారుతారు. ఇన్సులిన్ నిరోధకత పెరగడంతో పాటు దంత క్షయం వంటి అనేక అనారోగ్య సమస్యలు కూడా వస్తాయి. కనుక అధిక చక్కెర వినియోగం కూడా మన ఆరోగ్యాన్ని పాడు చేస్తుంది. నిద్రలేమి సమస్యతో ఆరోగ్యానికి చేటు చాలామంది నిద్రలేమి సమస్యతో బాధపడతారు. దీర్ఘకాలిక నిద్రలేమి వలన అనేక దీర్ఘకాలికమైన వ్యాధులు వస్తాయని చెబుతున్నారు. శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి రోజు ఏడు నుండి ఎనిమిది గంటలు నిద్రపోవాలని చెబుతున్నారు. ఇక చాలామంది పడుకునే ముందు స్మార్ట్ ఫోన్లు, టాబ్లెట్లు, కంప్యూటర్లు వంటి వాటిని వినియోగిస్తారు అయితే దీనివల్ల నిద్రలేమి సమస్య వస్తుంది. ఫలితంగా ఆరోగ్యం పాడవుతుంది. తక్కువ నీళ్ళు తాగటం కూడా ప్రమాదమే ఇంకా కొంతమంది చాలా తక్కువగా నీటిని తాగుతూ ఉంటారు. మీరు తక్కువగా తాగడం కూడా మన శరీరానికి హాని చేస్తుంది. మూత్ర సంబంధిత వ్యాధుల సంక్రమణ పెరుగుతుంది. ఇక సాధారణంగా పొరపాటుగా మనం పాటించే ఈ అలవాట్లు మానుకుంటే మంచిది. లేదంటే తీవ్ర ఇబ్బందిని ఎదుర్కోవాల్సి వస్తుంది.

# జామపండుతో ఆరోగ్య అద్భుతాలు అన్నీ ఇన్నీ కావు!



మన ఆరోగ్యాన్ని కాపాడడానికి పండ్లు ఎంతో ఉపయోగపడతాయి. అటువంటి పండ్లలో జామపండు ఒకటి. జామ పండులో ఆరోగ్యానికి దోహదం చేసే పోషకాలు చాలానే ఉన్నాయి . జామ పండులో ఉండే పోషకాలు మనలను అనేకరకాల జబ్బుల నుండి కాపాడతాయి. జామపండు మనకు ఇచ్చే ఆరోగ్య రహస్యాలు తెలిస్తే తినకుండా కచ్చితంగా ఉండరు. జామ పండులో ఫుల్ పోషకాలు జామ పండులో విటమిన్ సి, విటమిన్ ఏ, విటమిన్ కే, కేలరీలు, పొటాషియం, కార్బోహైడ్రేడ్లు, డైటరీ ఫైబర్, వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇందులో తక్కువ క్యాలరీలు, ఫైబర్ అధికంగా ఉంటుంది. ఈ కారణంగా వీటిని ప్రతి రోజు తింటే మంచిదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. జామ పండు తినడం వల్ల మన శరీరంలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది. జామపండుతో ఆరోగ్య ప్రయోజనాలు జామపండు తినటం కారణంగా శరీరంలో రోగనిరోధక శక్తి బాగా పెరుగుతుంది. ఇక మధుమేహ వ్యాధిగ్రస్తులకు జామపండు ఒక అద్భుత ఫలమని చెప్పాలి. మధుమేహ వ్యాధిగ్రస్తులు జామ పండ్లను ప్రతిరోజు తినొచ్చు. దీనిలో అధికంగా ఉండే ఫైబర్ కంటెంట్, అలాగే తక్కువ గ్లైసిమిక్ ఇండెక్స్ కారణంగా ఇది డయాబెటిస్ బాధితులకు ఒక మంచి పండుగా చెప్పొచ్చు.జామపండు మనలను అంటువ్యాధుల బారినుండి కాపాడుతుంది. జామపండుతో రక్తపోటుకు చెక్ జామపండులో ఉండే పొటాషియం, సోడియం కారణంగా ఇది అధిక రక్తపోటును తగ్గించడానికి ఉపయోగపడుతుంది. జామ పండు గుండె ఆరోగ్యాన్ని కాపాడుతుంది. జామపండు శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించి మంచి కొలెస్ట్రాల్ ను పెంచేందుకు సహాయపడుతుంది. జామ పండులో తక్కువ క్యాలరీలు ఉండడం వల్ల ఇది బరువు తగ్గడానికి ఎంతగానో దోహదం చేస్తుంది. కంటి ఆరోగ్యాన్ని కాపాడే జామపండు జామ పండులో ఉండే ఫోలేట్ మన పునరుత్పత్తి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. పీరియడ్స్ సమయంలో మహిళలకు వచ్చే నొప్పిని తగ్గిస్తుంది. జామపండు దృష్టిని మెరుగుపరుస్తుంది. కంటి ఆరోగ్యాన్ని కాపాడుతుంది. ఇన్ని ఆరోగ్య ప్రయోజనాలు ఉన్న జామపండును రోజుకు ఒకటి తింటే ఎంతో మంచిది. దీనివల్ల మనకు ప్రయోజనమే కానీ నష్టం లేదు. మెదడు పనితీరుకు, చర్మ ఆరోగ్యానికి జామపండు జామపండు నరాలకు పట్టుత్వాన్ని ఇస్తుంది. మెదడు చురుగ్గా పనిచేసేలా చేస్తుంది. జామపండులో విటమిన్ కే, విటమిన్ బి త్రీ పుష్కలంగా ఉండడం వల్ల ఇది మెదడు పనితీరును మెరుగుపరుస్తుంది. జామ పండులో లైకోపీన్, కెరోటిన్, విటమిన్ ఏ, విటమిన్ సి పుష్కలంగా ఉండడం వల్ల ఇది మన చర్మ సంరక్షణకు ఎంతగానో దోహదం చేస్తుంది. చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచి ముడతలు తగ్గించడానికి ఉపయోగపడుతుంది.

# పరగడుపున ఈ నీళ్లను తాగితే... షుగర్ తో పాటు వంద రోగాలకు స్వస్తి!

ఆరోగ్యమే మహాభాగ్యం అంటారు. ఆరోగ్యంగా ఉండాలి అనుకునేవారు ప్రతిరోజు మనకు ఆరోగ్యాన్ని ఇచ్చే దినుసులను గురించి తెలుసుకొని వాటిని ఉపయోగించాలి. అలా మనకు ఆరోగ్యాన్ని ఇచ్చే వాటిలో మెంతులు ఒకటి. మెంతులను రాత్రి నీళ్లలో నానబెట్టి తెల్లవారుజామున తాగితే అనేక అనారోగ్య సమస్యలు దూరమవుతాయి. మెంతులు మీ డయాబెటిస్ ను కంట్రోల్ చేస్తుంది. బరువు పెరగకుండా నిరోధిస్తుంది. మీ ఆకలిని అదుపులో ఉంచుతుంది. మలబద్ధకం వంటి సమస్యలను దూరం చేస్తుంది.మెంతి గింజల నీటితో ఆరోగ్యంప్రతిరోజు ఒకటి నుంచి రెండు టీ స్పూన్ల మెంతి గింజలను రాత్రిపూట నానబెట్టి పరగడుపున తాగితే మీ జీవక్రియ వేగవంతం కావడమే కాకుండా రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయిలు నియంత్రించేలా చేస్తుంది. ప్రతిరోజు ఉదయం పరగడుపున మెంతి గింజల నీళ్లను తాగితే జీర్ణ క్రియ మెరుగుపడుతుంది. ఫైబర్ జీర్ణవ్యవస్థలోని ఆహార కదలికలను ప్రోత్సహించడంతోపాటు మలబద్ధకాన్ని నివారిస్తాయి.చిరంజీవి ఎవరో నాకు తెలియదు..!బరువును తగ్గించే మెంతి గింజల నీళ్ళురక్తంలో



చక్కెర స్థాయిలను నియంత్రించడమే కాకుండా డయాబెటిస్ ను కంట్రోల్ లో ఉంచుతుంది. మెంతి గింజల నీరు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తుంది .మెంతి గింజలలో ఉండే ఫైబర్ చెడు కొలెస్ట్రాల్ ను తగ్గించడానికి, గుండె జబ్బులను నివారించడానికి ఉపయోగపడుతుంది. మెంతి గింజల నీళ్లు మన బరువును తగ్గించడానికి ఎంతగానో దోహదం చేస్తుంది. ఇది మనకు కడుపు నిండిన భావనను కలిగించి అధిక ఆహారం తీసుకోకుండా చేస్తుంది.మెంతి గింజల నీళ్లతో రోగ నిరోధక శక్తి మెంతి గింజల నీళ్లు చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. మెంతి గింజలలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు మన చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు మొటిమలు లేదా మచ్చలను తగ్గించడంలో సహాయ పడతాయి. మెంతి గింజల నీళ్లు రోగ నిరోధక శక్తిని పెంచడంతోపాటు, శరీరం ఇన్ఫెక్షన్లతో పోరాడే సామర్థ్యాన్ని పెంచుతాయి. ఇది నొప్పులను, వాపులను తగ్గిస్తుంది. ఆర్థరైటిస్ వంటి లక్షణాలను తగ్గించడానికి కూడా మెంతి గింజల నీళ్లు ఉపయోగపడతాయి.మెంతి గింజల నీళ్ళతో జుట్టుకు ఆరోగ్యం మెంతి గింజలు నీళు గుండె ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తాయి. మహిళలలో రుతు సమస్యలను తగ్గిస్తాయి. జుట్టు పెరుగుదలకు మెంతి గింజల నీళ్లు ఉపయోగపడతాయి. మెంతి గింజలు ప్రోటీన్, నికోటినిక్ ఆమ్లానికి మంచి మూలం. ఇవి జుట్టు ఆరోగ్యానికి మేలు చేస్తాయి. మెంతి గింజల నీళ్లు తాగడం వల్ల ఇది జుట్టు పెరుగుదలకు దోహదం చేస్తుంది. జుట్టు రాలడాన్ని తగ్గిస్తుంది.

# రాత్రి భోజనం తర్వాత ఇది ఒక్కటి తినండి.. మీ శక్తికి తిరుగుండదు!

భారతీయ గృహాలలో యాలకులు ఒక సాధారణ సుగంధ ద్రవ్యం. ఇది కేవలం ఆహారానికి రుచిని జోడించడమే కాకుండా, ఆరోగ్యానికి కూడా అనేక ప్రయోజనాలను అందిస్తుంది. ముఖ్యంగా రాత్రి భోజనం తర్వాత ఒక యాలకులు తినడం వల్ల అనేక లాభాలు ఉన్నాయి. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడం నుండి నోటి దుర్వాసనను తగ్గించడం వరకు అనేక విధాలుగా సహాయపడుతుంది. ఈ అలవాటు మీ ఆరోగ్యానికి ఎలా మేలు చేస్తుంది. 1. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది: రాత్రి భోజనం తర్వాత యాలకులు తినడం వల్ల జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. భోజనం తర్వాత అజీర్ణం, గ్యాస్, ఉబ్బరం వంటి సమస్యలను తగ్గించడంలో సహాయపడతాయి. యాలకులలో ఉండే గుణాలు జీర్ణ ఎంజైమ్‌లను ప్రేరేపిస్తాయి. ఈ ఎంజైమ్‌లు ఆహారాన్ని సులభంగా జీర్ణం చేయడానికి సహాయపడతాయి. అంతేకాకుండా, యాలకులు కడుపులో గ్యాస్ ఉత్పత్తిని తగ్గించి, కడుపు ఉబ్బరాన్ని నివారిస్తాయి. రాత్రి భోజనం తర్వాత యాలకులు తినడం వల్ల మరుసటి రోజు ఉదయం మీరు తేలికగా, హాయిగా ఉంటారు. నోటి దుర్వాసన అనేది చాలా మందిని ఇబ్బంది పెట్టే సమస్య. రాత్రి భోజనం తర్వాత యాలకులు తినడం వల్ల నోటి దుర్వాసనను తగ్గించవచ్చు. యాలకులలో ఉండే సుగంధ తైలాలు నోటిలోని బ్యాక్టీరియాను చంపడానికి సహాయపడతాయి. యాలకులు లాలాజలాన్ని ఉత్పత్తి చేయడంలో సహాయపడతాయి. ఇది నోటిని శుభ్రంగా ఉంచడానికి తోడ్పడుతుంది. సహజమైన మౌత్ ఫ్రెషనర్‌గా యాలకులు పనిచేస్తాయి. రసాయనాలు కలిగిన మౌత్ వాష్‌లకు బదులుగా, యాలకులు ఒక సహజమైన, ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయం.' 3. యాంటీఆక్సిడెంట్ లక్షణాలు: యాలకులలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. యాంటీఆక్సిడెంట్లు శరీర కణాలను ఫ్రీ రాడికల్స్ నుండి రక్షించడంలో సహాయపడతాయి. ఫ్రీ రాడికల్స్ శరీరంలో అనేక వ్యాధులకు కారణమవుతాయి. యాలకులలో ఉండే యాంటీఆక్సిడెంట్లు క్యాన్సర్, గుండె జబ్బులు , ఇతర దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. రాత్రి భోజనం తర్వాత యాలకులు తినడం వల్ల శరీరం రాత్రంతా యాంటీఆక్సిడెంట్లను గ్రహిస్తుంది, ఇది ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. 4. యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు: యాలకులలో యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు కూడా ఉన్నాయి. శరీరంలో మంట అనేక ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. యాలకులు శరీరంలో మంటను తగ్గించడంలో సహాయపడతాయి. ఇది కీళ్ల నొప్పులు, వాపులు , ఇతర ఇన్ఫ్లమేటరీ పరిస్థితులను తగ్గించడానికి సహాయపడుతుంది. రాత్రి భోజనం తర్వాత యాలకులు తినడం వల్ల శరీరం రాత్రంతా మంటను తగ్గించుకోవడానికి సహాయపడుతుంది, ఇది మొత్తం ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. 5. రక్తపోటును నియంత్రిస్తుంది: యాలకులు రక్తపోటును నియంత్రించడంలో కూడా సహాయపడతాయి. అధిక రక్తపోటు గుండె జబ్బులు , స్ట్రోక్ వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. యాలకులలో పొటాషియం ఉంటుంది, ఇది రక్తపోటును తగ్గించడంలో సహాయపడుతుంది. అలాగే, యాలకులు రక్త నాళాలను విశ్రాంతింపజేస్తాయి, ఇది రక్త ప్రవాహాన్ని మెరుగుపరుస్తుంది రక్తపోటును తగ్గిస్తుంది. రాత్రి భోజనం తర్వాత యాలకులు తినడం వల్ల రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది, ముఖ్యంగా అధిక రక్తపోటు ఉన్నవారికి ఇది చాలా ఉపయోగకరంగా ఉంటుంది.

# స్పోర్ట్స్ న్యూస్

## ఐసీసీ షాకింగ్ నిర్ణయం.. ఆ దేశ క్రికెట్ బోర్డుపై కొరడా!

కెనడా క్రికెట్ బోర్డుకు ఐసీసీ ఊహించని షాక్ ఇచ్చింది. ఆ దేశ క్రికెట్ బోర్డులో చోటుచేసకున్న పరిపాలనా లోపాలు, అవినీతి ఆరోపణల నేపథ్యంలో ఐసీసీ కఠిన నిర్ణయం తీసుకుంది. క్రికెట్ కెనడాకు అందాల్సిన నిధులను రాబోయే 6 నెలల పాటు నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గత కొంతకాలంగా కెనడా క్రికెట్ పాలనలో జరుగుతున్న అంతర్గత వివాదాలు, ఐసీసీ నిబంధనల ఉల్లంఘనలపై జరిపిన విచారణల అనంతరం ఈ చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతానికి ఈ నిర్ణయం వల్ల కెనడా క్రికెట్ మ్యాచ్ లపై తక్షణ ప్రభావం పడకపోయినప్పటికీ.. ఆర్థికంగా ఆ బోర్డు తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయే ప్రమాదం ఉంది.కెనడా క్రికెట్ బోర్డు పూర్తిగా ఐసీసీ ఇచ్చే నిధులపైనే ఆధారపడి నడుస్తోంది. కెనడా క్రికెట్ బోర్డు వార్షికాదాయంలో



దాదాపు 63 శాతం వాటా నేరుగా ఐసీసీ ఫండింగ్ ద్వారానే వస్తుంది. 2024 ఆర్థిక సంవత్సర లెక్కల ప్రకారం బోర్డు మొత్తం రాబడి సుమారు 5.7 మిలియన్ కెనడియన్ డాలర్లు (దాదాపు రూ. 40 కోట్లు) కాగా.. అందులో ఐసీసీ నుంచే ఏకంగా 3.6 మిలియన్ కెనడియన్ డాలర్లు వచ్చాయి. ఇప్పుడు ఈ నిధులన్నీ ఆరు నెలల పాటు ఆగిపోనుండటంతో బోర్డు నిర్వహణ కెనడాకు అత్యంత భారంగా మారనుంది.నిధుల నిలిపివేతకు గల ఖచ్చితమైన కారణాలను ఐసీసీ అధికారికంగా ప్రకటించనప్పటికీ.. కెనడాకు చెందిన 'ద ఫిఫ్త్ ఎస్టేట్' అనే ఇన్వెస్టిగేటివ్ ప్రోగ్రామ్ బయటపెట్టిన నిజాలు దీనికి కారణమని తెలుస్తోంది. బోర్డులో ఆర్థిక అవకతవకలు, ఐసీసీ పాలసీల ఉల్లంఘనలపై ఈ ప్రోగ్రామ్ ఒక డాక్యుమెంటరీని విడుదల చేసింది. అంతేకాకుండా గత టీ20 ప్రపంచకప్‌లో న్యూజిలాండ్‌తో కెనడా ఆడిన మ్యాచ్‌పై ఐసీసీ యాంటీ కరప్షన్ యూనిట్ (ఎఅజ) ప్రస్తుతం దర్యాప్తు చేస్తోంది. మరోవైపు, కెనడా మాజీ కోచ్ ఖుర్రం చౌహాన్ మాట్లాడిన ఒక ఆడియో లీక్ అవ్వడం కూడా బోర్డును మరింత ఇరకాటంలో పడేసింది. జాతీయ జట్టు సెలక్షన్‌లో కొందరు నిర్దిష్ట ఆటగాళ్లనే ఎంపిక చేయాలంటూ బోర్డు సీనియర్ అధికారులు తనపై ఒత్తిడి తెచ్చారని, మ్యాచ్ ఫిక్సింగ్ ప్రయత్నాలు కూడా జరిగాయని ఆ ఆడియోలో ఆయన ఆరోపించడం సంచలనంగా మారింది.ఈ వివాదాలపై కెనడా క్రికెట్ మీడియా మేనేజర్ జిమ్మీ శర్మ స్పందిస్తూ.. ప్రస్తుత బోర్డుకు ఇవన్నీ గత పాలకులు చేసిన తప్పుల వల్ల వారసత్వంగా వచ్చాయని వెల్లడించారు. బోర్డులో ఉన్న పరిపాలనా లోపాలు, ఆర్థిక నియంత్రణ లోపాలను సరిదిద్దడానికి తాము పూర్తిగా కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. ఐసీసీ గానీ, కెనడా క్రికెట్ బోర్డు గానీ ఈ సస్పెన్షన్‌పై ఇంకా పూర్తి స్థాయి అధికారిక ప్రకటనలు విడుదల చేయాల్సి ఉంది.

## పంజాబ్ కింగ్స్ యాజమాన్యంపై అశ్విన్ ఆగ్రహం



ఇంటర్నెట్ డెస్క్: ఐపీఎల్ 2026 టోర్నీ ఆరంభంలో వరుస విజయాలతో దూసుకెళ్లిన పంజాబ్ కింగ్స్.. ఇప్పుడు పీకల్లోతు కష్టాల్లో పడింది. ప్లే ఆఫ్స్‌కు చేరుకునే తొలి జట్టుగా నిలుస్తుందనుకున్న పంజాబ్.. టోర్నీ నుంచే నిష్క్రమించే పరిస్థితికి చేరుకుంది. వరుసగా ఐదు ఓటములను నమోదు చేసి పాయింట్ల పట్టికలో నాలుగో స్థానంలో కొనసాగుతోంది. అయితే ఈ సీజన్‌లో పంజాబ్.. రెండు హోం వేదికలను ఎంచుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పంజాబ్ కింగ్స్ యాజమాన్యం తీసుకున్న ఆ నిర్ణయంపై భారత మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు. జట్టుకు రెండు వేర్వేరు హోం వేదికలను ఎంపిక చేయడం సరైన విధానం కాదని తెలిపాడు.'కోల్‌కతా నైట్ రైడర్స్, చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్.. వంటి విజయవంతమైన జట్లు తమ హోం మ్యాచ్‌లను ఒకే వేదికపై ఆడుతున్నాయి. పంజాబ్ మాత్రం ముల్లాన్‌పూర్, ధర్మశాల వేదికలను ఎంచుకుని.. అటుఇటు మారాల్సిన పరిస్థితి వచ్చింది. ఒక వేదికపై ఐదు మ్యాచ్‌లు గెలిచిన తర్వాత మరో వేదికకు మారిన పంజాబ్.. టోర్నీ నుంచే నిష్క్రమించాల్సిన పరిస్థితికి వచ్చింది. పంజాబ్ కింగ్స్ యాజమాన్యం తీసుకున్న ఈ నిర్ణయం అస్సలు సరైంది కాదు. ఇది జట్టు ప్రదర్శనలపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. ముల్లాన్‌పూర్‌లో పంజాబ్ అజేయంగా నిలిచింది. కానీ ధర్మశాల పిచ్ పరిస్థితులు జట్టుకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. అక్కడ బ్యాటింగ్ అంత సులువుగా ఉండదు. పిచ్‌కు అలవాటు పడేలోపే జట్టు 20-40 పరుగులు తక్కువ చేస్తోంది. పంజాబ్ వరుసగా ఓడిపోవడానికి కేవలం కెప్టెన్సీ, జట్టు వైఫల్యం కారణంగా చూడకూడదు. వేదిక మార్పు కూడా ప్రధాన కారణాల్లో ఒకటి' అని అశ్విన్ అభిప్రాయపడ్డాడు.ఇదిలా ఉంటే, పంజాబ్ కింగ్స్ ప్లే ఆఫ్స్ ఆశలు సజీవంగా ఉండాలంటే ఇప్పటి నుంచి ఆడే ప్రతి మ్యాచ్‌లో గెలిచి తీరాల్సిందే. పంజాబ్ తన తదుపరి మ్యాచ్‌ను ఆదివారం ఆర్సీబీతో ఆడనుంది.

## తప్పుల నుంచి నేర్చుకోవడమే ముఖ్యం: రవి శాస్త్రి

ఐపీఎల్ 2026 సీజన్‌లో ప్లే ఆఫ్స్ అవకాశాలను చెన్నై సూపర్ కింగ్స్ జట్టు సంక్లిష్టం చేసుకుంది. లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ చేతిలో ఘోర ఓటమిని చవిచూసి పాయింట్ల పట్టికలో ఆరో ప్లేస్‌కు పడిపోయింది. ఈ సీజన్‌లో సీఎస్కే తరపున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ అన్షుల్ కాబోజ్. టోర్నీ ఆరంభం నుంచి కీలక బౌలర్‌గా మారిన అతడిని లఖ్‌నవూ బ్యాటర్లు టార్గెట్ చేయడం సీఎస్కేను దెబ్బకొట్టింది. వేసిన 2.4 ఓవర్లలోనే ఏకంగా 63 పరుగులు సమర్పించుకున్నాడు. మిచెల్ మార్ష్, నికోలస్ పూరన్.. అన్షుల్ కాంబోజ్‌పై విరుచుపడ్డారు. ఈ నేపథ్యంలో టీమిండియా దిగ్గజం రవిశాస్త్రి.. అన్షుల్‌కు మద్దతుగా నిలిచాడు.'క్రికెట్‌లో ప్రతి ప్లేయర్ తప్పులు చేస్తాడు. కానీ వాటి నుంచి నేర్చుకోవడమే ముఖ్యం. మిచెల్ మార్ష్ వరుసగా నాలుగు సిక్సర్లు బాదిన తర్వాత అన్షుల్ తన వ్యూహాన్ని మార్చాల్సింది. యార్కర్లు లేదా ఆఫ్ స్టంప్ బయట ఎత్తయిన బౌన్సర్లు వేయాల్సింది. ఛాతీ లేదా నడుము స్థాయి ఎత్తులో బంతులు సంధిస్తే.. మార్ష్ లాంటి ప్లేయర్లు అద్భుతంగా ఆడేస్తారు. ఈ మ్యాచ్‌లో విఫలమైనందుకు కాంబోజ్ బాధ పడాల్సిన అవసరం లేదు. ఈ మ్యాచ్‌లో అతడు విలువైన పాఠం నేర్చుకుంటాడు. ప్రతి ఒక్కరూ తప్పులు చేస్తారు. అన్షుల్.. తప్పుల నుంచి పాఠాలు నేర్చుకోవడమే ఇక్కడ ముఖ్యం. ఓటమి పాలైనప్పటికీ సీఎస్కే అద్భుత ప్రదర్శనే చేసింది. లఖ్‌నవూ పిచ్‌పై 187 పరుగులు చేయడం చిన్న విషయం కాదు. రుతురాజ్ గైక్వాడ్, సంజు శాంసన్.. ఫామ్‌లోకి వస్తే జట్టుకు మరింత బలం చేకూరుతుంది' అని రవి శాస్త్రి అభిప్రాయపడ్డాడు.ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత చెత్త రికార్డును కాంబోజ్ తన ఖాతాలో వేసుకున్నాడు. ఒకే ఓవర్లో నాలుగేసి సిక్స్‌లను రెండుసార్లు ఇచ్చిన ఏకైక బౌలర్‌గా నిలిచాడు. కేవలం 2.4 ఓవర్లలో 63 పరుగులు సమర్పించుకున్నాడు. ఇదే సీఎస్కే ఓటమికి ప్రధాన కారణంగా మారింది. పర్పుల్ క్యాప్ రేసులో ఉన్న స్టార్ బౌలర్ నుంచి ఇలాంటి ప్రదర్శన రావడంతో చెన్నై అభిమానులు తట్టుకోలేకపోతున్నారు. ఇదిలా ఉంటే, ప్లే ఆఫ్స్‌కు వెళ్లాలంటే ఇప్పటి నుంచి ఆడే ప్రతి మ్యాచ్‌లో సీఎస్కే గెలవాల్సిన పరిస్థితి. తన తదుపరి మ్యాచ్‌ను సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో మే 18న తలపడనుంది.



## థాయ్‌లాండ్ ఓపెన్ సెమీస్‌లో ఘన విజయం.. ఫైనల్‌కు సాత్విక్ - చిరాగ్ జోడీ



బ్యాంకాక్: థాయ్‌లాండ్ ఓపెనన్ వరల్డ్‌టూర్ సూపర్-500 టోర్నీలో సాత్విక్ సాయిరాజ్ - చిరాగ్‌శెట్టిల జోడీ అదరగొట్టింది. మాలేషియాకు చెందిన గో జెఫీ - నూర్ ఇజ్జుద్దీన్‌లపై సెమీస్‌లో 19-21, 22-20, 21-16 తేడాతో విజయం సాధించి ఫైనల్స్‌కి దూసుకెళ్లింది. ఈ సీజన్‌లో ఇదే తొలి ఫైనల్ కావడం గమనార్హం. తొలి సెట్‌లో మలేషియా జోడీ 21-19 తేడాతో గెలిచింది. ఆ తర్వాత భారత జోడీ పుంజుకుంది. ఉత్కంఠగా సాగిన రెండో సెట్‌ని 22-20 తేడాతో సొంతం చేసుకుంది. మ్యాచ్‌ను తేల్చే మూడో సెట్‌లో విజయం కోసం ఇరు జట్లు తీవ్రంగా శ్రమించాయి. అయితే, భారత జోడీ దూకుడు ప్రదర్శించి 21-16తో సెట్‌ను.. అలాగే మ్యాచ్‌ను గెలుకుంది.


## జింబాబ్వేతో మ్యాచ్.. పాక్ కెప్టెన్ ప్రపంచ రికార్డు




కరాచీ: జింబాబ్వే తో జరిగిన టి-20 సిరీస్‌లో పాకిస్థాన్ అద్భుత ప్రదర్శన చేసింది. ఇప్పటికే ఈ సిరీస్‌ని పాకిస్థాన్ 3-0 తేడాతో కైవసం చేసుకుంది. అయితే మూడో టి-20లో పాక్ కెప్టెన్ ఫాతిమా సనా ప్రపంచ రికార్డు సృష్టించింది. కేవలం 15 బంతుల్లోనే అర్థ శతకం సాధించింది. ఈ క్రమంలో రిచా ఘోష్, సోఫీ డివైన్, ఫోబ్ లిచ్‌ఫీల్డ్ (18 బంతులు) రికార్డును అధిగమించింది. 2022లో వార్విక్‌షైర్ తరపున మేరీ కెల్లీ, 2025 సూపర్ స్మాష్‌లో ఒటాగో తరపున లారా హారిస్ కూడా 15 బంతుల్లోనే హాఫ్ సెంచరీ చేయడం గమనార్హం. అయితే, అంతర్జాతీయంగా మాత్రం ఫాతిమాదే ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీ. పాక్ తరపున గతంలో ఈ రికార్డు నిదా దార్ పేరిట ఉండేది. 2019లో దక్షిణాఫ్రికాపై ఆమె 20 బంతుల్లో ఈ రికార్డును సాధించింది. ఇక ఈ మ్యాచ్‌లో పాకిస్థాన్ 20 ఓవర్లలో 223 పరుగులు చేసింది. ఆ తర్వాత లక్ష్య చేధనలో జింబాబ్వే 90 పరుగులకే కుప్పకూలి పోయింది. ఈ మ్యాచ్‌లో 19 బంతుల్లో 10 ఫోర్లు, 2 సిక్సర్లతో 62(నాటౌట్) పరుగులు చేసిన ఫాతిమాకి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది.

## సీఎస్‌కే ఓటమికి అతనే కారణం.. బౌన్సర్లతో కొంపముంచాడు: క్రిష్ శ్రీకాంత్

చెన్నై సూపర్ కింగ్స్(సీఎస్‌కే) యువ పేసర్ అన్షుల్ కాంబోజ్‌పై టీమిండియా మాజీ కెప్టెన్ క్రిష్ శ్రీకాంత్ విమర్శలు గుప్పించాడు. అన్షుల్ కంబోజ్ చెత్త బౌలింగ్ కారణంగానే లక్నో సూపర్ జెయింట్స్ చేతిలో చెన్నై సూపర్ కింగ్స్ ఓటమిపాలైందని అభిప్రాయపడ్డాడు. పదే పదే షార్ట్ పిచ్ బాల్స్ వేసి అన్షుల్ కాంబోజ్ మూల్యం చెల్లించుకున్నాడని పేర్కొన్నాడు.ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా లక్నో వేదికగా శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ 7 వికెట్ల తేడాతో చెన్నై సూపర్ కింగ్స్‌ను ఓడించింది. ఈ పరాజయంతో చెన్నై సూపర్ కింగ్స్ ప్లే ఆఫ్స్ అవకాశాలను సంక్లిష్టంగా మార్చుకుంది. అన్షుల్ కాంబోజ్(0/63) చెత్త బౌలింగ్ చెన్నై పతనాన్ని శాసించింది. ఈ మ్యాచ్‌ను తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా విశ్లేషించిన క్రిష్ శ్రీకాంత్.. అన్షుల్ కాంబోజ్ చెత్త బౌలింగ్ ప్రదర్శనతోనే చెన్నై సూపర్ కింగ్స్ ఓటమిపాలైందన్నాడు.ముఖ్యంగా మిచెల్ మార్ష్‌కు అన్షుల్ కాంబోజ్ షార్ట్ పిచ్ బాల్స్ వేయడాన్ని శ్రీకాంత్ తప్పుబట్టాడు. వరుసగా సిక్స్‌లు బాదడంతో కాంబోజ్ భయపడిపోయాడని, పదే పదే తప్పు చేస్తూ మూల్యం చెల్లించుకున్నాడని చెప్పాడు.'అన్షుల్ కాంబోజ్ తొలి బంతినే షార్ట్ బాల్‌గా వేసాడు. ఆస్ట్రేలియా ఆటగాళ్లకు షార్ట్ బాల్స్ వేస్తే నిర్దాక్షిణ్యంగా శిక్షిస్తారు. మిచెల్ మార్ష్ తొలి బంతినే కవర్స్ మీదుగా సిక్సర్ బాదాడు. అయినా కూడా కాంబోజ్ బౌన్స్ సాధించడానికి షార్ట్ పిచ్ బాల్స్ వేసాడు. దాంతో రెండో బంతిని మార్ష్.. స్క్వేర్ లెగ్ మీదుగా మరో సిక్సర్ బాదాడు.తొలి రెండు సిక్సర్ల తర్వాత కాంబోజ్ భయపడిపోయాడు. మూడో బంతిని స్లో మోషన్‌లో చూస్తే ఈ విషయం స్పష్టంగా కనిపిస్తుంది. ఆ భయంతో తప్పిదం మీద తప్పిదం చేశాడు. పదే పదే షార్ట్ పిచ్ బాల్స్ వేస్తూ మూల్యం చెల్లించుకున్నాడు.వాస్తవానికి సీఎస్‌కే గుడ్ లెంగ్త్, టెస్ట్ మ్యాచ్ లెంగ్త్‌ల్లో బౌలింగ్ చేయాల్సింది. అంతేకాకుండా లెఫ్టార్మ్ పేస్ ద్వయంతో ముందుకు వెళ్లాల్సింది.



స్పెన్సర్ జాన్సన్ కేవలం ఆఖరి ఓవర్‌లో మాత్రమే పరుగులు ఇచ్చాడు. కానీ కాంబోజ్ మాత్రం 2.6 ఓవర్లలో 63 పరుగులు ఇచ్చుకున్నాడు. అంటే 16 బంతుల్లో 63 పరుగులు ఇచ్చాడు. ప్రతీ బంతికి నాలుగు పరుగులు సమర్పించుకున్నాడు.ముఖేష్ చౌదరి మాత్రం 3 ఓవరల్లలో 24 పరుగులు మాత్రమే ఇచ్చి ఒక వికెట్ తీసాడు. స్పెన్సర్ జాన్సన్, ముఖేష్‌లతో గుడ్ లెంగ్స్, టెస్ట్-మ్యాచ్ లెంగ్త్‌ల్లో బౌలింగ్‌ను కొనసాగించాల్సింది.




# పర్సెంటేజీ విధానంపై 15మందితో కమిటీ


## ఫిల్మ్ ఛాంబర్ కీలక నిర్ణయం



సింగిల్ స్క్రీన్ థియేటర్ యాజమాన్యాలు, నిర్మాతలకీ మధ్య సినిమాల ప్రదర్శనల విషయంలో వివాదం నెలకొన్న క్రమంలో ఓ అంగీకారానికి వచ్చారు. దీనిపై వాణిజ్య మండలి అధ్యక్షుడు డి.సురేశ్‌బాబు ఆధ్వర్యంలో శుక్రవారం థియేటర్ యాజమాన్యాలు, నిర్మాతలు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఫిల్మ్ ఛాంబర్ కీలక నిర్ణయం తీసుకుంది. పర్సంటేజీ విధానంపై కమిటీ ఏర్పాటుచేయాలని నిర్ణయించింది. 15 మందితో కమిటీ వేయనున్నట్లు వెల్లడించింది. ఈ కమిటీ రెండు నెలల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. దీనిపై సి.కల్యాణ్ మాట్లాడుతూ.. రెండు నెలల్లో సమస్య పరిష్కారం అవుతుందన్నారు. సినిమాల విడుదలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని స్పష్టంచేశారు. కమిటీలో ఐదుగురు నిర్మాతలు, ఐదుగురు ఎగ్జిబిటర్లు, ఐదుగురు డిస్ట్రిబ్యూటర్లు ఉంటారని ఆయన తెలిపారు. శుక్రవారం జరిగిన సమావేశంలో నిర్మాతలు అల్లు అరవింద్, చదలవాడ శ్రీనివాసరావు, సుప్రియ యార్లగడ్డ, రవి కిషోర్, మైత్రీ రవి, సి.కల్యాణ్, దిల్ రాజు, రాధా మోహన్, చెరుకూరి సుధాకర్, భోగవల్లి బాపినీడు, సాహు గారపాటి, సతీష్ కిలారు, నాగవంశీ, ఎస్ కె ఎన్, రాజేష్ దండా, ధీరజ్ మొగిలినేని దాదాపు 50 మంది నిర్మాతలు పాల్గొన్నారు. ఎగ్జిబిటర్స్ తరపున విజయేందర్ రెడ్డి, శ్రీధర్ తదితరులు హాజరయ్యారు.

# పెద్ది ప్రమోషన్లలో కొత్త ఎమోషన్

## బుచ్చిబాబును లాంగ్ డ్రైవ్ తీసుకెళ్లిన రామ్‌చరణ్




రామ్ చరణ్, బుచ్చిబాబు కాంబినేషన్‌లో వస్తున్న క్రేజీ ప్రాజెక్ట్ 'పెద్ది' విడుదలకు సిద్ధమవుతోంది. జూన్ 4న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానున్న నేపథ్యంలో, చిత్ర యూనిట్ ప్రమోషన్ల స్పీడ్ పెంచింది. సినిమాపై హైప్ క్రియేట్ చేసేందుకు సరికొత్తగా ప్లాన్ చేస్తోంది. తాజాగా హీరో రామ్ చరణ్, దర్శకుడు బుచ్చిబాబు ప్రచారంలో భాగంగా ఒక ప్రత్యేకమైన ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. అయితే ఇది మామూలు ఇంటర్వ్యూలా కాకుండా, రామ్ చరణ్ స్వయంగా కారు డ్రైవ్ చేస్తూ బుచ్చిబాబును ఒక షికారుకి తీసుకెళ్లారు. ప్రయాణంలోనే వీరిద్దరూ సినిమా ముచ్చట్లను పంచుకున్నారు. ఈ సందర్భంగా బుచ్చిబాబు మాట్లాడుతూ.. సినిమా పనులతో ఇంత బిజీగా ఉన్నప్పటికీ, నన్ను ఇలా లాంగ్ డ్రైవ్‌కు తీసుకువచ్చినందుకు థాంక్యూ చరణ్ సార్ అంటూ తన ఆనందాన్ని పంచుకున్నారు. దానికి చరణ్ స్పందిస్తూ.. 'అదంతా సరే కానీ, మన 'పెద్ది' సినిమా ఎప్పుడు వస్తుందో ప్రేక్షకులకు కచ్చితంగా చెప్పు' అని నవ్వుతూ అడిగారు. దీంతో వీరిద్దరూ కలిసి జూన్ 4న 'పెద్ది' సినిమా థియేటర్లలోకి వస్తోందని అధికారికంగా ప్రకటించారు. భారీ అంచనాలతో వస్తున్న ఈ చిత్రాన్ని ప్రేక్షకులందరూ థియేటర్లలో చూసి ఎంజాయ్ చేయాలని రామ్ చరణ్, బుచ్చిబాబు కోరారు

# ఎట్టకేలకు థియేటర్లలోకి కురుప్పు

తమిళ స్టార్ హీరో సూర్య నటించిన భారీ చిత్రం 'కరుప్పు' విడుదలకు ఎట్టకేలకు అడ్డంకులు తొలగాయి. గత కొన్ని రోజులుగా ఈ సినిమా విడుదలపై నెలకొన్న అనిశ్చితి అభిమానులను, నిర్మాతలను తీవ్ర ఆందోళనకు గురిచేసింది. అయితే అన్ని సమస్యలు సద్దుమణగడంతో సినిమా ప్రపంచవ్యాప్తంగా మే 15, శుక్రవారం థియేటర్లలో సందడి చేసింది. తెలుగులో ఈ సినిమా 'వీరభద్రుడు' పేరుతో విడుదల అవుతోంది. సినిమా విడుదల సందర్భంగా సూర్య అభిమానులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. డియర్ ఆల్.. మాతో ఉన్నందుకు ధన్యవాదాలు. ఈరోజు నుంచి 'కరుప్పు', 'వీరభద్రుడు' థియేటర్లలో విడుదల అవుతున్నాయి' అంటూ ఆయన సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. ప్రస్తుతం ఈ సందేశం అభిమానుల్లో ఆనందాన్ని నింపుతోంది. మొదట ఈ చిత్రాన్ని మే 14న విడుదల చేయాలని భావించినప్పటికీ, చివరి నిమిషంలో కొన్ని కారణాలతో విడుదల వాయిదా పడింది. దీంతో అభిమానులు తీవ్ర నిరాశకు గురయ్యారు. ఈ నేపథ్యంలో చిత్ర నిర్మాణ సంస్థ డ్రీమ్ వారియర్ పిక్చర్స్ ప్రేక్షకులకు క్షమాపణలు తెలిపింది. కొన్ని ప్రయాణాలు కాలాన్ని మాత్రమే కాదు.. మనసును కూడా పరీక్షిస్తాయి. సినిమా కోసం ఎదురుచూసిన ప్రతి ఒక్కరికీ మేము క్షమాపణలు చెబుతున్నాం. విడుదలలో జరిగిన ఆలస్యం మమ్మల్ని కూడా బాధించింది. అయినప్పటికీ మాపై మీరు చూపించిన నమ్మకం, ప్రేమ మాకు ఎంతో బలం ఇచ్చాయి అంటూ నిర్మాణ సంస్థ భావోద్వేగ ప్రకటన విడుదల చేసింది. అలాగే 'కరుప్పు' కేవలం తమ సినిమా మాత్రమే కాదని, ప్రేక్షకులందరి కథ అని పేర్కొంది. ఎన్నో కష్టాలు, నిద్రలేని రాత్రుల తర్వాత ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నామని తెలిపింది. తమిళనాడు, తెలుగు రాష్ట్రాల్లో విడుదల ఆగిపోయిన సమయంలో ముంబై, పుణెలోని కొన్ని థియేటర్లలో సినిమా ప్రదర్శన జరిగినట్లు సమాచారం రావడంతో నిర్మాతలు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో సినిమా పైరసీకి గురయ్యే ప్రమాదం ఉందని వారు పేర్కొన్నారు. సూర్య సరసన త్రిష




హీరోయిన్‌గా నటించింది. ఈ చిత్రానికి ఆర్జే బాలాజీ దర్శకత్వం వహించారు. సంగీతాన్ని సాయి అభ్యంకర్ అందించారు.

# మెగాఫోన్ పట్టిన రామ్ పోతినేని

టాలీవుడ్ ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని తన అభిమానులకు అదిరిపోయే బర్త్ డే సర్ప్రైజ్ ఇచ్చారు. ఇన్నాళ్లూ తన నటనతో, డ్యాన్స్‌తో వెండితెరపై మ్యాజిక్ చేసిన రామ్, ఇప్పుడు సరికొత్త అవతారంలోకి మారబోతున్నారు. తన 23వ చిత్రం ద్వారా రామ్ దర్శకుడిగా పరిచయం కాబోతున్నట్లు అధికారికంగా ప్రకటించాడు. ఈ వార్త ఇప్పుడు ఫిల్మ్ నగర్ వర్గాల్లో సంచలనంగా మారింది. ఎవరూ ఊహించని విధంగా ఒక ఉత్కంఠభరితమైన సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్‌తో రామ్ తన దర్శకత్వ ప్రయాణాన్ని ప్రారంభించ బోతున్నట్లు తెలుస్తుంది. ఈ చిత్రానికి 'వీర' అనే పవర్ ఫుల్ టైటిల్‌ను ఖరారు చేసినట్లు సమాచారం. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్ అత్యంత ఆసక్తికరంగా ఉంది. 'ది స్టోరీ ఆఫ్ ఏ లోన్ వోల్ఫ్' అనే ట్యాగ్‌లైన్‌తో వచ్చిన ఈ పోస్టర్ చూస్తుంటే, రామ్ ఒక ఇంటెన్స్ రోల్‌లో కనిపించబోతున్నారని స్పష్టమవుతోంది. ఈ సినిమా కోసం రామ్ మరో సంచలన నిర్ణయం తీసుకున్నారు. తన సొంత నిర్మాణ సంస్థ అయిన 'స్రవంతి మూవీస్' ఉండగానే, ప్రత్యేకంగా 'రాపో సినిమాటిక్స్' అనే కొత్త ప్రొడక్షన్ హౌస్‌ను ప్రారంభించారు. తన కలల ప్రాజెక్ట్‌ను రామ్ సోదరుడు కృష్ణ పోతినేని ఈ బ్యానర్‌పై అత్యంత ప్రతిష్టాత్మకం గా నిర్మించనున్నారు. దర్శకుడిగా తన నిర్ణయం గురించి రామ్ స్పందిస్తూ.. 'ఇన్నాళ్లు వాళ్ల కథల్లో నా ముఖం చూశారు.. ఈ కథలో నా గొంతు వింటారు' అంటూ పవర్ ఫుల్ కోట్‌ను షేర్ చేశారు. తనలోని మరో కోణాన్ని ఆవిష్కరించేందుకు రామ్ పూర్తి స్థాయిలో సిద్ధమైనట్లు ఈ మాటలు చెబుతున్నాయి.




# పల్లెటూరి ప్రేమకథ దూరదర్శిని

ప్రస్తుత కాలంలో సినిమా విజయాన్ని బడ్జెట్ నిర్ణయించడం లేదు, కేవలం కంటెంట్ మాత్రమే శాసిస్తోంది. బలమైన కథాంశంతో వస్తున్న చిన్న చిత్రాలు కూడా బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లను సాధిస్తూ సంచలనం సృష్టిస్తున్నాయి. సరిగ్గా అదే బాటలో, కేవలం కథనే నమ్ముకుని ఈ వారం ప్రేక్షకుల ముందుకు వచ్చిన చిత్రం 'దూరదర్శిని'. టైటిల్‌తోనే సగటు ప్రేక్షకుడిలో పాత జ్ఞాపకాలను తట్టిలేపిన ఈ సినిమా, థియేటర్లలో సందడి చేస్తోంది. చిత్ర కథ మట్టపర్రు అనే పచ్చని పల్లెటూరి చుట్టూ తిరుగుతుంది. ఊరిలో కుల రాజకీయాలు, అంతరాలు ఉన్నప్పటికీ.. హరి (సువీక్షిత్), వాణి (గీతికా రతన్) చిన్నప్పటి నుండి ఒకరినొకరు ఇష్టపడతారు. ప్రతి శుక్రవారం దూరదర్శినిలో వచ్చే చిత్రలహరిని చూడటానికి వెళ్లే క్రమంలో వీరి మధ్య ప్రేమ చిగురిస్తుంది. అయితే, ఊరిలో పలుకుబడి ఉన్న వ్యక్తి, వాణి అన్నయ్య అయిన పరశురామ్‌తో హరికి గొడవ జరగడంతో వీరి ప్రేమాయణం మలుపు తిరుగుతుంది. పేదవాడైన హరి, పెత్తందారీ కుటుంబానికి చెందిన వాణిని ఎలా దక్కించుకున్నాడు? వీరి ప్రేమ కథకు కుల సమీకరణాలు ఎలా అడ్డంకిగా మారాయి? అనేదే ఈ సినిమా ఇతివృత్తం. ర్శకుడు కార్తికేయ 1990ల నాటి గ్రామీణ వాతావరణాన్ని, అప్పటి మనుషుల భావోద్వేగాలను అద్భుతంగా వెండితెరపై ఆవిష్కరించారు. ముఖ్యంగా 'దూరదర్శిని' అనేది కేవలం టైటిల్ మాత్రమే కాకుండా, కథలో ఒక కీలక పాత్రలా సాగుతుంది. ప్రథమార్ధంలో హీరో హీరోయిన్ల మధ్య సాగే సన్నివేశాలు నెమ్మదిగా సాగినప్పటికీ, పల్లెటూరి అందాలు, అల్లరి చిల్లర కామెడీ ప్రేక్షకులను అలరిస్తాయి. విరామ సమయానికి కథలో వేగం పుంజుకుంటుంది. ద్వితీయార్థంలో కుల వివక్ష వల్ల కలిగే పరిణామాలు, భావోద్వేగపూరితమైన సన్నివేశాలు సినిమాను నిలబెట్టాయి. ÷-లక్లైమాక్స్‌లో వచ్చే ట్విస్ట్ ప్రేక్షకులను ఆశ్చర్యానికి గురిచేస్తుంది.నూతన నటీనటులైన సువీక్షిత్, గీతికలు తమ నటనతో ఆకట్టుకున్నారు. తొలి చిత్రమే అయినా ఎంతో పరిణతితో నటించి పాత్రలకు ప్రాణం పోశారు. ఇక హీరో స్నేహితులుగా నటించిన భద్ర, బలరామ్ గ్యాంగ్ పండించిన కామెడీ అక్కడక్కడా నవ్వులు పూయిస్తుంది. విలనిజం పండించిన పరశురాం తన గంభీరమైన నటనతో మెప్పించారు.




Printed and Published and Owned by **Dr. K. HARINATHA REDDY** on behalf of **Abhyudaya Publications, cell : 098483 34101, Printe d at Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh and Published From **Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh, **Editor : Gudur Gopal, RNI No. APTEL/2012/46940,** e-mail: **sreechakratelugu@gmail.com.**